సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 31.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 158
పేజీలు: 12 వెల: రూ. 5

## ఒకేసారి 3 నెలల రేషన్
**ఏప్రిల్‌లోనే మొత్తం బియ్యం**



- సాఫ్ట్ వేర్ అప్ డేట్
- చర్యలు చేపట్టిన అధికారులు

09

## సహజీవన జంటలకు వైవాహిక హోదా
**కలిసి జీవించే జంటలకు చట్టబద్ధ గుర్తింపు దిశగా కేంద్రం కీలక అడుగు**

- 2027 జనగణనలో లివ్-ఇన్ రిలేషన్‌లకు కొత్త నిర్వచనం
- స్వచ్ఛంద సహజీవనాన్ని వివాహంగా పరిగణించనున్న కేంద్ర నిర్ణయం
- 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'తో జనగణనలో పౌరులకు కొత్త సౌకర్యం
- సహజీవన జంటల వివరాలు కూడా సెన్సస్‌లో నమోదు చేయనున్న ప్రభుత్వం

09

కాళేశ్వరం కథ

# ఇరకాటంలో రెండు పార్టీలు
**ఒకే దెబ్బకు రెండు పిట్టలు**

- బీఆర్ఎస్, బీజేపీలో అంతర్మథనం
- అన్నీ అక్రమాలే అంటూ బీఆర్ఎస్ పై విమర్శలు
- సీబీఐకి ఇచ్చినా ఏం చేయడం లేదంటూ బీజేపీ టార్గెట్
- రెండు పార్టీలపై ఒకేసారి సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు జరిగినా కాళేశ్వరం ప్రాజెక్టు ఉచ్చు మాత్రం బిగిసుకుంటూనే ఉంది. గతంలో బీఆర్ఎస్ వరకే పరిమితమైన ఈ ఉదంతం.. ఇప్పుడు బీజేపీని కూడా ఇరకాటంలో పడేసినట్లైంది. రెండు పార్టీలను ఒకే తూటాకు టార్గెట్ చేసినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ రెండు పార్టీలనూ ఇరకాటంలో పెట్టేలా మారిపోయాయి.

**కాళేశ్వరమే కీలకం**
తెలంగాణ రాజకీయాల్లో 'కాళేశ్వరం' ప్రాజెక్టు ఇప్పుడు సెంట్రల్ పాయింట్‌గానే ఉంటుంది. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ రెండు పార్టీలనూ ఇరకాటంలో పెట్టేలా ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తూనే, విచారణలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. కేసీఆర్, హరీష్‌రావును జైలులో పెట్టాకే మాట్లాడాలంటూ రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ఈ ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న వివాదాలను మరోసారి రాజుకునేలా చేసింది.

**పీసీ ఘోష్ నివేదికతో..**
కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, ఆర్థిక అవకతవకలపై నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అసెంబ్లీలో ప్రకంపనలు మిగతా 02లో

# ఆయుధం ఆత్మవిశ్వాసమే
**మారుతున్న ప్రపంచ ప్రాధాన్యతలు**


- ఏఐ టెక్నాలజీ భయాన్ని మింగేసిన యుద్ధ జ్వాలలు
- ఆర్థిక వ్యవస్థకు 'యుద్ధ' గ్రహణం
- చరిత్ర పునరావృతం.. సవాళ్లు కొత్తవి, సంక్షోభం పాతదే!

10

*నిన్నటి వరకు మన భయం.. మనం నేర్చుకున్న విద్య నిరర్థకమైపోతుందేమో అని, రేపటి వేళ యంత్రం మన పొట్ట కొడుతుందేమో అని! కానీ, రాత్రికి రాత్రే ప్రపంచం మారిపోయింది. ఇప్పుడు భయం ఉద్యోగం గురించి కాదు.. రేపటి సూర్యోదయాన్ని చూసేందుకు మనం ప్రాణాలతో ఉంటామా లేదా అని. స్క్రీన్ల మీద మెరిసే కోడింగ్ అక్షరాల కంటే, ఆకాశంలో గర్జించే క్షిపణుల శబ్దమే ఇప్పుడు మనిషిని ఎక్కువగా వణికిస్తోంది. ఒకప్పుడు టెక్నాలజీ భవిష్యత్తు గురించి మేధోమథనం చేసిన ప్రపంచం, నేడు బంకర్లలో ప్రాణాలు దాచుకునే దౌర్భాగ్యం వైపు అడుగులు వేస్తోంది. సవాళ్లు మారుతున్నాయి, రూపాలు మారుతున్నాయి.. కానీ మనిషి కళ్లల్లోని ఆ నిస్సహాయత మాత్రం అలాగే ఉండిపోయింది.*



## సర్కారు ఆసుపత్రుల్లో విదేశీ వైద్యం
**పేదలకు కార్పొరేట్ స్థాయిలో చికిత్స**



- ప్రభుత్వాస్పత్రుల్లో కొత్త తరహా విధానం
- విదేశీ వైద్యులతో సమన్వయం కోసం వెబ్సైట్
- పైలట్ ప్రాజెక్టుగా కొన్నింటిలో మొదలు

09

## మంత్రి పొంగులేటిపై ఫిర్యాదు
03

**గవర్నర్‌కు బీఆర్ఎస్ శాసనసభ పక్షం విజ్ఞప్తి**



## కేటీఆర్ మంత్రాంగం జీవన్ కోసమేనా?
**ఏప్రిల్ 10న బీఆర్ఎస్ లోకి జీవన్ రెడ్డి**

- జగిత్యాల జిల్లా నాయకులతో కేటీఆర్ భేటీ..

09



జగిత్యాల రాజకీయ కోటలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ చేరికపై స్పష్టత రావడంతో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఏప్రిల్ 10న లక్ష్మీపూర్‌లో భారీ బహిరంగ సభ సాక్షిగా ఆయన గులాబీ జెండా కప్పుకోవడం ఖాయమైంది. కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి జిల్లా ముఖ్య నేతలతో భేటీ కావడం, సమన్వయ మంత్రం పఠించడం సంతరించుకుంది. **-ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

● ఐపీఎల్ 2026


## చేతులెత్తేస్తున్న చెన్నయ్
**బ్యాటర్ల ఘోర వైఫల్యంతో**
**19.4 ఓవర్లకు 127 పరుగులకు ఆలౌట్**

*ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన ఈ సీజన్‌లో ఏమాత్రం మెరుగుపడటం లేదు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్ల ధాటికి చెన్నై బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఏ ఒక్కరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోవడంతో 19.4 ఓవర్లలో కేవలం 127 పరుగులకే చెన్నై ఆలౌట్ అయ్యింది.*




# భక్తి రాజకీయం
**కేసీఆర్‌ది వైష్ణవం, రేవంత్‌ది శైవం**

- సీతారాముల కల్యాణానికి కేసీఆర్ దూరం
- క్రమం తప్పకుండా పట్టువస్త్రాలిచ్చిన రేవంత్
- కేసీఆర్ వద్దన్న వాటికి ప్రయార్టీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో భక్తి రాజకీయం మొదలైంది. బీఆర్ఎస్ పాలనలో ఏయే రంగాలను, ఏయే ప్రాంతాలను కేసీఆర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారో.. వాటినే రేవంత్ రెడ్డి ప్రాధాన్యతగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. కేసీఆర్ హయాంలో భద్రాచలం సీతారాముల కళ్యాణానికి వెళ్లడానికి ప్రాముఖ్యత చూపించలేదు. కానీ, సీఎం రేవంత్ మాత్రం క్రమం తప్పకుండా హాజరవుతూనే ఉన్నారు. మరో వైపు కేసీఆర్ వైష్ణవ సాంప్రదాయాలను నెత్తి నేసుకుంటే.. ఇప్పుడు రేవంత్ మాత్రం శైవ నామాలు పెడుతున్నారు. దీంతో రేవంత్ రెడ్డి అధ్యాత్మిక రాజకీయం కూడా చేస్తున్నారని, కేసీఆర్ వైష్ణవానికి ప్రాధాన్యతనిస్తే.. రేవంత్ శైవానికి ప్రాధాన్యతనిస్తున్నారని, దేశంలో రాహుల్ విధానం కూడా అదేననే ప్రచారం మొదలైంది. మిగతా 02లో

- పునర్విభజన నేపథ్యంలో మారుతున్న సమీకరణాలు
- రానున్న సెగ్మెంట్లలో ఇప్పటి నుంచి వడబోత
- ప్రస్తుత ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి ఒత్తిళ్లు




# నాయకులు కావలెను
**కొత్త నేతల కోసం వేట మొదలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గాల పునర్విభజన పుణ్యమాని మునుపెన్నడూ లేని విధంగా నాయకులకు గిరాకీ పెరిగిందని అంటున్నారు. ఏపీలో దాదాపు 88 అసెంబ్లీ, 13 పార్లమెంట్ నియోజకవర్గాలు కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయి. మిగతా 02లో

## ఆర్థిక అగాథంలోకి తెలంగాణ
**రుణభారం పెరుగుతోంది జాగ్రత్త!**

- ప్రభుత్వానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ హెచ్చరిక
- నష్టాల్లో మెజార్టీ శాఖలు
- బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.31,229 కోట్లు అదనపు ఖర్చు
- రూ 5.62 లక్షల కోట్లకు చేరిన రాష్ట్ర అప్పులు

02

## మండలిలోనూ మైనింగ్ మంటలు
**చరిత్రలో తొలిసారిగా 11 మంది ఎమ్మెల్సీల సస్పెన్షన్**

- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై హౌస్ కమిటీకి ప్రతిపక్షం పట్టు
- కేబినెట్ నుంచి మంత్రి పొంగులేటి బర్తరఫ్ కు డిమాండ్
- ప్లకార్డులతో ఛైర్మన్ పోడియం దిగ్బంధం
- అడ్డుకున్న మార్షల్స్ తో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వాగ్వాదం
- ఆందోళన విరమించాలని ఛైర్మన్ ఆదేశాలు బేఖాతర్
- కీలక బిల్లులకు సభ ఆమోదం
- విద్వేష బిల్లుపై విపక్షాల అభ్యంతరం
- ఉద్యమకారులను గుర్తించాలని సొంత పార్టీకి విజయశాంతి సూచనలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో వెలుగుచూసిన అక్రమ మైనింగ్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్నది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ అక్రమ వ్యవహారం వరుసగా మూడో రోజూ ఉభయసభల్లో తీవ్ర దుమారం లేపింది. అధికార కాంగ్రెస్ పార్టీ, మిగతా 02లో

హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు బెదిరింపులతో కూడిన బతిమిలాడడాన్ని చేస్తున్నారు. ట్రంప్ బెదిరింపులను ఇరాన్ పట్టించుకోవడం లేదు.



**పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..**



తిరుమల యాత్రలో శ్రీకాళహస్తిని చివరిగా దర్శించాలన్నది శాస్త్రబద్ధమైన నియమం కాదు, ఇది కాలక్రమేణా ఏర్పడిన ఒక సంప్రదాయం మాత్రమే.

# ఇరకాటంలో రెండు పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించింది. ప్రాజెక్టు రీ-డిజైనింగ్ పేరుతో ప్రజల సొమ్మును కొందరు నేతలు దండుకున్నారని నివేదిక స్పష్టం చేసిందని సీఎం పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం వంటి బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన లోపాలపై నివేదిక కీలక ఆధారాలను బయటపెట్టిందని రేవంత్ స్పష్టం చేశారు.

**కేసీఆర్ కనుసన్నల్లోనే**

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రమేయం లేకుండా ఏదీ జరగలేదని రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా కుండ బద్దలు కొట్టారు. ప్రాజెక్టు రూపకల్పన నుంచి ఇంజినీర్లకు ఆదేశాలు ఇవ్వడం వరకు అన్నీ కేసీఆర్ ఆదేశాల మేరకే జరిగాయని సీఎం ఆరోపించారు. కేవలం అధికారులను బలిపశువులను చేసి, అసలైన సూత్రధారులు తప్పించుకోవడం కుదరదని, అప్పటి జలవనరుల మంత్రి హరీష్‌రావు కూడా దీనికి సమాన బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు**

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూనే, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. నెలలు గడుస్తున్నా సీబీఐ విచారణ ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. ఇది బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందానికి నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్, హరీష్‌రావును జైలులో పెట్టిన తర్వాతే బీజేపీ నేతలు నీతులు మాట్లాడాలని ఘాటుగా స్పందించారు. ఈ వివాదంలో తన నిజాయితీని నిరూపించుకోవడానికి సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఒకవేళ కాళేశ్వరం అవినీతిలో తన పాత్ర కానీ, తన కుటుంబ సభ్యుల పాత్ర కానీ ఉందని తేలితే ఏ శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజల సొమ్ము దోచుకున్న వారు ఎవరైనా సరే, వారు ముఖ్యమంత్రి అయినా, మాజీ మంత్రులైనా చట్టానికి లోబడి శిక్ష అనుభవించాల్సిందేనని తేల్చి చెప్పారు.

**అసెంబ్లీలో వాడీవేడి చర్చ**

ప్రభుత్వం కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నారు. అవినీతిని అస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్ పరువు తీయాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని వారు మండిపడుతున్నారు. అటు బీఆర్ఎస్ ను సమర్థించలేక, ఇటు కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెప్ప లేక బీజేపీ నేతలు సతమతమవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు వరప్రసాదం కావాల్సింది పోయి, రాజకీయాలు చేసుకునేందుకు క్షేత్రంగా మారింది. లక్షల కోట్ల అవినీతి జరిగి ఉంటే.., బాధ్యులు ఎవరో తేల్చి వారికి శిక్ష పడే వరకు ప్రజలకు న్యా యం జరగదు. కేవలం అసెంబ్లీలో మాటల యుద్ధానికి పరిమితం కాకుండా, విచారణ వేగవంతం చేసి వాస్తవాలను బయటపెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 'జైలు' వ్యా ఖ్యల నేపథ్యంలో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# నాయకులు కావలెను

(మొదటి పేజీ తరువాయి)

అదేవిధంగా తెలంగాణలో సైతం 50 శాతం సీట్లు పెరుగుతున్నాయి. దీంతో ఆయా స్థానాల్లో జెండా ఎగురవేసే సమర్థులైన నేతల కోసం ప్రధాన పార్టీలన్నీ వేట మొదలుపెట్టాయి. కొత్త నియోజకవర్గాలు ఏర్పడటం ఒక ఎత్తైతే, అక్కడ ప్రజలను మెప్పించగల అభ్యర్థులను రంగంలోకి దిం చడం మరో ఎత్తుగా చెబుతున్నారు. ప్రస్తు తం ఉన్న పరిస్థితుల్లో కేవలం ప్రజాబలం ఉంటే సరిపోదని, పార్టీని నడిపించగల సమర్థతతోపాటు కొన్ని కీలక సమీకరణాలను పార్టీలు పరిగణనలోకి తీసుకుంటున్నాయ ని అంటున్నారు. ప్రజలను తమవైపు తిప్పుకోగల నేర్పు, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయగల రాజకీయ చతురత ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందంటున్నారు. దీంతో ప్రధాన పార్టీలు తమ ప్రత్యర్థులను సైతం ఆకర్షించేలా ఆపరేషన్ స్టార్ట్ చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. బలం కావాల్సిందే ఇక ఎన్నికల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం తో, ఆర్థికంగా బలంగా ఉన్నవారిని గేలం వేసేలా పార్టీలు అడుగులు వేస్తున్నాయని చెబుతున్నారు. కొత్త నియోజకవర్గాలకు బా ధ్యతలు అప్పగించడానికి సొంతంగా ఖర్చు పెట్టుకోగల నాయకుల కోసం పార్టీలు 'రెడ్ కార్పెట్' పరుస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నా రు. అదే సమయంలో కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో ఏ సామాజిక వర్గం ఓట్లు ఎక్కు వగా ఉన్నాయి? ఎవరిని నిలబెడితే గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయనే లెక్కల్లో పార్టీలు అగ్రనాయకత్వాలు దృష్టి పెడుతున్నాయని చెబుతున్నారు. పునర్విభజన విపక్షాలకు ఊపిరాడని పరిస్థితి కాగా, నియోజకవర్గాల పెరుగుదల ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలకు పెద్ద పరీక్షగా మారిందని అంటు న్నారు. ఇప్పటికే ఉన్న స్థానాల్లోనే సరైన అ భ్యర్థులు లేక ఇబ్బంది పడుతున్న తరుణం లో, అదనంగా పెరిగిన స్థానాలను భర్తీ చే యడం విపక్ష పార్టీలను ఉక్కిరిబిక్కిరి చే స్తోందని అంటున్నారు. బలమైన అభ్యర్థులు లేకపోతే అధికార పార్టీ దూకుడును అడ్డుకోవడం అసాధ్యమని విపక్ష నేతలు ఆందోళన చెందుతున్నారు.

**అధికార పార్టీకి 'తయారీ' కష్టాలే!**

ఇక అధికార పార్టీకి వనరులు, ఆశావహులు ఉన్నప్పటికీ, కొత్త నేతలను గ్రౌండ్ లెవల్ నుంచి తయారు చేయడం అంత సులువేమీ కాదని విశ్లేషిస్తున్నారు. పాత నేత ల మధ్య సమన్వయం కుదర్చడం, కొత్తవారికి టికెట్లు ఇస్తే వచ్చే అసమ్మతిని తట్టుకోవడం వంటి అంతర్గత సమస్యలు అధికార పార్టీకి సవాల్ విసురుతున్నట్లు చెబుతున్నా రు. కేవలం గెలుపు గుర్రాలనే నమ్ముకోవాలా లేక పార్టీ కేడర్ నుంచి నాయకులను ప్రోత్సహించాలా అన్న సందిగ్ధాన్ని అధికార పార్టీ ముఖ్యులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి, పునర్విభజన అనేది రా జకీయ నిరుద్యోగులకు వరంలా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు.



# భక్తి రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

**కొత్త చర్చ ఇదే**

రాష్ట్ర రాజకీయాల్లో ఆధ్యాత్మికత ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీస్తోంది.దశాబ్ద కాలంగా సాగిన కేసీఆర్ పాలనలో వైష్ణవ సంప్రదాయం వెలుగులీనినట్లు కనిపిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు మాత్రం శైవ క్షేత్రాల వైపు బలంగా పడుతున్నాయి. ఈ మార్పు కేవలం భక్తికి సంబంధించిన అంశమే కాకుండా, ఒక వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడగా భావించవచ్చు. అధికారం చేపట్టిన నాటి నుండి రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు పాత ఒరవడిని మారుస్తూ కొత్త ఆధ్యాత్మిక ముద్రను వేసే ప్రయత్నంలా కనిపిస్తున్నాయి.

**కేసీఆర్ హయాంలో వైష్ణవ ఆలయాలకు ఆదరణ**

కేసీఆర్ తన హయాంలో యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అద్భుతమైన రీతిలో పునర్నిర్మించి ఆధ్యాత్మికంగానూ గుర్తింపు పొందారు. చినజీయర్ స్వామి సూచనలతో వైష్ణవ ఆగమ శాస్త్రం ప్రకారం సాగిన ఆ నిర్మాణం ఆయన రాజకీయ వ్యక్తిత్వానికి ఒక ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టింది. అయితే ఈ క్రమంలోనే ఆయనపై కొన్ని విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా దక్షిణ కాశీగా పిలిచే వేములవాడ రాజన్న క్షేత్ర అభివృద్ధిని విస్మరించారనే అసంతృప్తి ఉత్తర తెలంగాణ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఏటా వంద కోట్లు ఇస్తానన్న హామీ అమలు కాకపోవడం కేసీఆర్ ఇమేజ్‌పై కొంత ప్రతికూల ప్రభావం చూపింది.

**శైవ ఆలయాలకు రేవంత్ నిధులు**

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరిగ్గా ఆ బలహీనతనే తన బలంగా మార్చుకునే పనిలో పడ్డారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడమే కాకుండా, మూసి నది ప్రక్షాళన ప్రాజెక్టులో భాగంగా వంద అడుగుల భారీ శివుడి విగ్రహం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం చేపట్టాలనే నిర్ణయం ఆయనను ఒక శివ భక్తుడిగా ప్రజల ముందుకు తీసుకెళ్తోంది. కేసీఆర్ మార్కు వైష్ణవ వైభవానికి ప్రత్యామ్నాయంగా శైవ సంప్రదాయాన్ని తెరపైకి తెచ్చి తనదైన ముద్ర వేయాలని రేవంత్ ఆశిస్తున్నారు.

**జాతీయ స్థాయిలోనూ రాహుల్ ది శైవం**

ఈ పరిణామాల వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రభావం కూడా కనిపిస్తోంది. రాహుల్ గాంధీ తనను తాను తరచుగా శివ భక్తుడిగా ప్రకటించుకుంటున్నారు. ఇటీవల జరిగిన సభల్లో శివుడిని సహనానికి, సాధారణత్వానికి చిహ్నంగా చూపిస్తూ విష్ణువును ఆడంబరాలకు నిలయంగా పోల్చడం ద్వారా కాంగ్రెస్ ఒక కొత్త భావజాలాన్ని ప్రచారంలోకి తెచ్చింది. రేవంత్ రెడ్డి కూడా అదే సిద్ధాంతాన్ని రాష్ట్రంలో అమలు చేస్తూ శైవ క్షేత్రాలకు పెద్దపీట వేస్తున్నారు. దీని ద్వారా బీజేపీ అనుసరించే హిందుత్వ రాజకీయాలకు భిన్నమైన ఒక దేశీయ ఆధ్యాత్మిక మార్గాన్ని ఆయన అనుసరిస్తున్నారు.

ఈ శైవ మంత్రం రేవంత్ రెడ్డికి రాజకీయంగా ఎంతవరకు కలిసి వస్తుందనేది మాత్రం అంచనా వేయడం కష్టమేనని రాజకీయ వర్గాల వాదన. కేసీఆర్ శైవాన్ని నిర్లక్ష్యం చేశారనే విమర్శను వాడుకుంటూనే, రేవంత్ తనపై వైష్ణవ వ్యతిరేకి అనే ముద్ర పడకుండా చూసుకోవాల్సి ఉంటుందని, యాదాద్రి, భద్రాద్రి వంటి పుణ్య క్షేత్రాల పట్ల ఉదాసీనంగా ఉంటే అది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపే అవకాశం ఉందంటున్నారు. ఆధ్యాత్మికతలో వివక్ష కనిపిస్తే అది పాలకులకు నష్టం కలిగిస్తుందని గత అనుభవాలు హెచ్చరిస్తున్నాయి. తెలంగాణ వంటి భక్తిభావం కలిగిన సమాజంలో ఏ ఒక్క సంప్రదాయానికో పరిమితం కావడం రాజకీయంగా క్షేమకరం కాదని, రేవంత్ రెడ్డి శైవ క్షేత్రాలను అభివృద్ధి చేస్తూనే అందరి దేవుళ్లను సమానంగా గౌరవించే నాయకుడిగా నిరూపించుకోవాలని, లేకపోతే ఇది కేవలం రాజకీయ వ్యూహంగా.. లేదా ఓట్ల వేటగా మాత్రమే మిగిలిపోతుందని విశ్లేషకులు అంటున్నారు.

# మండలిలోనూ మైనింగ్ మంటలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా మంత్రి పొంగులేటిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోన్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ.. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీని వేయాలని శాసనమండలిలో డిమాండ్ చేసింది. కౌంటర్ గా అధికార పక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల విమర్శలు, ప్రతి విమర్శలతో మండలిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉదయం సభా కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారాన్ని లేవనెత్తారు. ఆ సంస్థపై హౌజ్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన ప్లకార్డులతో ఛైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. సభ్యులు శాంతించాలని పలుమార్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. విజ్ఞప్తి చేశారు. సభా సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో.. జోక్యం చేసుకున్న శాసనసభాపక్ష వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. సభ్యులు ఆందోళన విరమించాలని ఛైర్మన్ చెప్పినప్పటికీ.. వినకుండా సభా కార్యకలాపాలకు అడ్డుపడటం సరికాదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.



ఈ వ్యవహారంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను మంత్రి గుర్తు చేశారు. అదే సమయంలో ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి జోక్యం చేసుకున్న మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. పదకొండు మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వారిని సోమవారం ఒక రోజంతా సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత సభ్యులను సభ నుంచి మార్షల్స్ బయటికి పంపించేశారు. అనంతరం శాసనమండలి కొద్దిసేపు వాయిదా పడింది. సస్పెండ్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల్లో మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, రమణ, యాదవరెడ్డి, రాజు, నవీన్ కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోటిరెడ్డి ఉన్నారు.

**పొంగులేటి రాజీనామా వరకు పోరాటం: బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం మౌనం ఎందుకని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. నైతిక బాధ్యత వహించి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసే వరకు సభలో, బయట పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని తీర్మానం**

పశ్చిమ ఆసియాలో యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని అసెంబ్లీలో ఆందోళన వ్యక్తమైంది. క్రూడ్ ఆయిల్ సరఫరా దెబ్బతిని భారత్ సహా అనేక దేశాలపై ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. యుద్ధం ఆపేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

**హేట్ స్పీచ్ బిల్లు సెలెక్ట్ కమిటీకి**

ద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కఠిన శిక్షలు, పోలీసులకు అధిక అధికారాలపై ఆందోళనలు వ్యక్తమవడంతో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు.

**ప్రతిపక్షాల విమర్శలు**

బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిల్లును ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. వాట్సాప్ గ్రూప్ సభ్యులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇది భావ స్వేచ్ఛకు ముప్పని అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వ వివరణ**

మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లు ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్‌కు భంగం కలిగించదని, కక్షసాధింపు ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.


**రోడ్ల అభివృద్ధితో ఆర్థిక ప్రగతి**

ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్రంలో 12,000 కి.మీ రోడ్ల అభివృద్ధి లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. మెరుగైన రహదారులు ఆర్థికాభివృద్ధికి దోహదమవుతాయని చెప్పారు.

**ఉద్యమకారులకు గౌరవం అవసరం**

ఎమ్మెల్సీ విజయశాంతి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఆర్థిక అగాథంలోకి తెలంగాణ?



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలోని ప్రభుత్వ రంగ సంస్థల తీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విస్తుపోయే నిజాలును బట్టబయలు చేసింది. తెలంగాణ రాష్ట్ర రుణ భారం భారీగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర మొత్తం అప్పులు రూ5.62 లక్షల కోట్లకు చేరాయని, ఇది జీఎస్‌డీపీలో 34.29 శాతంగా ఉందని తెలిపింది. ఎఫ్.ఆర్.బి.ఎం నిబంధనల ప్రకారం ఉండాల్సిన 32.8శాతం పరిమితిని రాష్ట్రం మించిపోయినట్లు వెల్లడించింది. బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.31,229 కోట్లు అదనంగా ఖర్చు చేయడం ఆర్థిక అస్తవ్యస్తతకు నిదర్శనమని కాగ్ వివరించింది. మరోవైపు నష్టాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థల పనితీరుపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని కాగ్ ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. ఎకౌంట్స్ సబ్మిట్ చేయడంలో ఆలస్యాన్ని నివారించాలని, పర్యావరణ నిధుల ఏర్పాటులో కఠినంగా వ్యవహరించాలని కోరింది. వ్యర్థాల నిర్వహణలో వార్డ్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసి, మానిటరింగ్ టీమ్‌ల ద్వారా పర్యవేక్షణ పెంచాలని అప్ర మత్తం చేసింది. ఈ మేరకు కాగ్ సోమవారం రాష్ట్ర ఆర్థిక, ప్రస్తుత అంశాలను వెల్లడించింది.

2023, మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కాగ్ తన నివేదికలో కీలక సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలోని మెజారిటీ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయని, కనీసం లెక్కలు సమర్పించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్లు స్పష్టం చేసింది. వాటిలో 16 సంస్థలు మూతపడినవి లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు కాగ్ నివేదికలో వెల్లడైంది. 67 పని చేస్తున్న సంస్థల్లో 49 సంస్థలు ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయి. కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు తెలిపింది. ఈ 18 సంస్థల టర్నోవర్ రూ.95,204 కోట్లుగా నివేదిక చెబుతోంది. 18 సంస్థల్లో 11 నష్టాల్లో, కేవలం ఆరు సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నట్లు రిపోర్టు ఇచ్చింది. ఆయా సంస్థల్లో మొత్తం పెట్టుబడులు రూ. 98,572 కోట్లుగా నమోదయ్యాయి. వీటిలో తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయింది. మొత్తం నెట్ విలువ రూ.–50,930 కోట్లుగా తగ్గింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. అలాగు సంస్థల పాలనలో తీవ్ర లోపాలున్నట్లు కాగ్ నివేదిక వెల్లడించింది.15 సంస్థల్లో 9 సంస్థలు స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదు. ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదు. ఐదు సంస్థల్లో ఆడిట్ కమిటీ లేకపోవడం గమనార్హం. తొమ్మిది సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదు. అలాగే.. సింగరేణి కంపెనీపై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వహించింది. డీజిల్ వినియోగంలో భారీ వ్యత్యాసాలు గుర్తించింది. కాగ్ నివేదిక ప్రకారం.. కొన్ని ఒప్పందాల్లో అవసరానికి మించి డీజిల్ వినియోగం జరిగింది. కాంట్రాక్టుల్లో లోపాల వల్ల రూ. 251 కోట్ల అనవసర ఖర్చులు చేశారు. ఒప్పంద నిబంధనలు అమలు కాక రూ.74 కోట్ల అదనపు భారం పడింది. కోల్ రవాణాలో లోపాలు రూ. 25 కోట్ల నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల వల్ల రూ. 1,078 కోట్ల అదనపు వసూళ్లు జరిగాయి. పర్యావరణ నిబంధనలు పాటించకలేదు. కాంట్రాక్టర్లు ఎఫ్లువెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయలేదు. మూతపడిన సంస్థలపై పునరుద్ధరణ లేదా మూసివేతపై నిర్ణయం అవసరమని పేర్కొంది. రూ. 324.96 కోట్ల లైబ్రరీ సెస్ సరిగా వసూలు కాలేదని రిపోర్ట్ లో పేర్కొంది. డ్రై వేస్ట్ ప్రాసె సింగ్ జరగకపోయినా కాంట్రాక్టర్లకు రూ.313.20 కోట్లు చెల్లించడాన్ని కాగ్ రిపోర్ట్ ఎత్తి చూపింది.

# జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం



**ముద్ర, విజయవాడ:**

జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం సాధ్యమని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) అగ్రనాయకులు, తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశాల్లో జర్నలిస్టుల హక్కులు, భద్రతపై కీలక తీర్మానాలు చేశామని తెలిపారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్లీనరీ – సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. 2007లో ఏర్పాటైన మజీథియా వేజ్ బోర్డు సిఫార్సుల తర్వాత గత 19 ఏళ్లుగా జర్నలిస్టులకు ఎలాంటి వేతన సవరణ జరగకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ, ప్రైవేట్, బ్యాంకింగ్ రంగాల్లో, చివరకు పొరుగు దేశమైన పాకిస్థాన్‌లో సైతం వేతన సవరణలు జరుగుతున్నా, భారతీయ మీడియా రంగంలో జరగకపోవడం గమనార్హమన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన మీడియా రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి, జర్నలిస్టులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రింట్ మీడియాతో పోలిస్తే, ఎలక్ట్రానిక్ మీడియాకు సరైన నియంత్రణ గానీ, వేతన నిర్మాణం గానీ లేదన్నారు. ఈ రంగంలోని ఉద్యోగులకు కనీసం అపాయింట్‌మెంట్ లెటర్లు లేకుండా షాపులు, ఎస్టాబ్లిష్‌మెంట్ వర్కర్ల లాగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని మీడియాను అణచివేసే కుట్రగా పేర్కొన్నారు. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ ర్యాంకు రోజురోజుకూ దిగజారుతోందన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి ప్రత్యేక 'మీడియా ప్రొటెక్షన్ యాక్ట్'ను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గడువు ముగిసి రెండేళ్లు అవుతున్నా ఇంకా కొత్త కౌన్సిల్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. సోషల్ మీడియాలో ఎలాంటి 'గేట్ కీపింగ్' లేకపోవడం వల్ల తప్పుడు సమాచారం విపరీతంగా వ్యాప్తి చెందుతోందని, ఇది వృత్తిపరమైన జర్నలిస్టులకు,మీడియా పరిశ్రమకు చెడ్డపేరు తెస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ నియంత్రణ లేకుండానే, సోషల్ మీడియాను నియంత్రించేలా ఒక సమతుల్య చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా పోరాడేందుకు, ఉమ్మడి స్వరాన్ని వినిపించేందుకు,ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లో అన్ని మీడియా సంస్థలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో ఐజేయూ సమావేశాల జయప్రదానికి సహకరించిన వారికి, ముఖ్యంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబుకి శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతనంగా ఎన్నికైన ఐజేయూ సెక్రటరీ జనరల్ సోమ సుందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఐజేయూ సమావేశాల్లో చర్చించి ఆమోదించిన తీర్మానాలను వివరించారు. ముఖ్యంగా పని పరిస్థితులు, వేతన వ్యవస్థ,మీడియా రంగంపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ఒక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైల్వే ప్రయాణ రాయితీలను జర్నలిస్టులకు వెంటనే పునరుద్ధరించాలని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేరును మీడియా కౌన్సిల్'గా మార్చాలని, ఇందులో డిజిటల్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కూడా స్థానం కల్పించాలని, ఈ కౌన్సిల్‌కు జర్నలిస్టులపై దాడులు జరిగినప్పుడు విచారణ చేసేలా మరిన్ని చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని తదితర ముఖ్య అంశాలపై వివిధ తీర్మానాలను ఐజేయూ ప్లీనరీలో ఆమోదించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు , ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా రవి, ఐజేయూ ఉపాధ్యక్షుడు అమర్ మోహన్ ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
31.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..

శ్రీకాళహస్తి దర్శనం తర్వాత ఇక యాత్ర కొనసాగించకూడదని ఎక్కడా పురాణాలు లేదా శాస్త్రాలు స్పష్టం-గా చెప్పలేదు.



# మంత్రి పొంగులేటిపై ఫిర్యాదు

- రాఘవ కన్‌స్ట్రక్షన్ భారీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ
- సీఎం, మంత్రి ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని విమర్శ
- మైనింగ్ అక్రమాలపై హైకోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్
- గవర్నర్‌కు బీఆర్ఎస్ శాసనసభ పక్షం విజ్ఞప్తి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మైనింగ్ అక్రమాలకు పాల్పడిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరపాలని బీఆర్ఎస్ శాసనసభ పక్షం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి చేసింది. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలనపై ఫిర్యాదు చేసింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ అక్రమాలపై అసెంబ్లీలో గత రెండు రోజులుగా అధికార, ప్రతిపక్షాల మధ్య జరిగిన వివాదం, అక్రమాలను రుజువు చేసే అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. సభలో ప్రస్తావించిన వివరాలు, ఆధారాలతో పాటు అధికార పార్టీ సభ్యుల ఎదురుదాడిని కూడా వివరించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎటువంటి అనుమతులు లేకుండా వందల కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచుకుంటున్నారని, దీనిపై గవర్నర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని తమ నాయకుడు హరీష్ రావు అసెంబ్లీలో లేవనెత్తగా ఎదురుదాడి జరిగిందన్నారు. అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. హౌస్ కమిటీలకు విలువ లేదని మంత్రి శ్రీధర్ బాబు చెప్పడం విచిత్రమన్నారు. సీబీసీఐడీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో మంత్రిపై నిష్పక్షపాత విచారణ జరగదని విమర్శించారు. తెలంగాణలో ఎమర్జెన్సీ తరహా పాలన కనిపిస్తోందని, ప్రజా సంపద దోపిడీని అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు వెల్లడించారు.




# ఏప్రిల్ 9న మిలియన్ మార్చ్ కేసు విచారణ

- కేసులు కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో కీలకమైన 'మిలియన్ మార్చ్' సందర్భంగా తమపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేసింది. సోమవారం ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించిన హైకోర్టు, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఆ రోజున ప్రభుత్వం సమర్పించే వివరణ ఆధారంగా కోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది. ఈ సందర్భంగా 2011లో ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చ్ సమయంలో జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పాల్గొన్న తమపై రాజకీయ ప్రేరేపితంగా కేసులు నమోదు చేశారని, వాటిని వెంటనే కొట్టివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు.



# యాదగిరిగుట్ట నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి హుండీలను మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఎస్పీఎఫ్, హోంగార్డుల భద్రత మధ్య స్వామివారి హుండీలను కొండకింద ఉన్న సత్యనారాయణ స్వామి మండపానికి తరలించి, ఈవో భవాని శంకర్, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి పర్యవేక్షణలో కౌంటింగ్ నిర్వహించారు. 20 రోజుల హుండీ ఆదాయం రూ.1,52,01,420 వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే మిశ్రమ బంగారం 54 గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 700 గ్రాములు లభించాయి. విదేశీ కరెన్సీగా అమెరికా 248 డాలర్లు, ఆస్ట్రేలియా 55 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్లు, యూఏఈ 95 దిర్హామ్స్, కెనడా 10 డాలర్లు, నేపాల్ 10, న్యూజిలాండ్ 10 డాలర్లు, సింగపూర్ 27, థాయిలాండ్ 220, మలేషియా 1, టాంజానియా 20,000, సౌదీ అరేబియా 50, యూరో 10 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.







# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి

- ఐజేయూ ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి హామీ
- ఎల్బీనగర్‌లో జర్నలిస్టుల సన్మానం

**ముద్ర న్యూస్, బ్యూరో హైదరాబాద్ :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వై. నరేందర్ రెడ్డి అన్నారు. ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వై. నరేందర్ రెడ్డిని ఎల్బీనగర్ వనస్థలిపురంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రంగారెడ్డి యూనిట్, ఎల్బీ నగర్ నియోజకవర్గ జర్నలిస్టుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల సాధనకు, సంక్షేమానికి ఐజేయూ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై జాతీయ స్థాయిలో గళమెత్తుతామని అన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యవర్గంలో రంగారెడ్డి జిల్లాకు పెద్దపీట దక్కిందన్నారు. నరేందర్ రెడ్డి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ కమిటీలో రంగారెడ్డి జిల్లాకు ప్రముఖ స్థానం కల్పించిన ఐజేయూ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జాతీయ కౌన్సిల్ సభ్యులకు, వివిధ రాష్ట్రాల అధ్యక్షులు, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివకుమార్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఆరోగ్య శిబిరం కన్వీనర్ రాచ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్, బెల్లిమల్లేష్ యాదవ్, సీనియర్ జర్నలిస్టులు కేసరి మల్లేష్‌గౌడ్, వెంపటి గణేష్, శ్రీనివాస్, రఫీ, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ఆలోచన అమోఘం

- సంక్షేమ మంత్రి అడ్లూరికి ప్రశంసల జల్లు
- బిల్లు ఆమోదం పట్ల మంత్రిగా గర్విస్తున్నా
- దేశంలోనే గొప్ప ప్రయత్నమని సీనియర్ సిటిజన్స్ అభిప్రాయం



**ముద్ర, హైదరాబాద్ :**

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణను చట్టబద్ధం చేస్తూ ఉద్యోగుల జీతాల నుంచి పోషణ ఖర్చు కోత విధించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అమలు దిశగా తీసుకెళ్లడం విశేష స్పందన తెచ్చుకుంది. ముఖ్యమంత్రి దూరదృష్టి నిర్ణయంపై సీనియర్ సిటిజన్స్ సంఘాలు ప్రశంసల వర్షం కురిపించాయి. వృద్ధ తల్లిదండ్రుల సంక్షేమాన్ని కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని సీనియర్ సిటిజన్స్ సంఘాలు అభివర్ణించాయి. ఉద్యోగస్తులు తమ తల్లిదండ్రుల బాధ్యతలను విస్మరిస్తే వారి జీతాల్లో 15 శాతం వరకు కోత విధించే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి, అనంతరం మండలిలోనూ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాలు, గిరిజన సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. వృద్ధుల సంక్షేమానికి ఇంత గొప్ప చట్టాన్ని తీసుకురావడం పట్ల తాను మంత్రిగా గర్విస్తున్నానని తెలిపారు. కుటుంబ విలువలను కాపాడే దిశగా ఇది ఒక సంచలనాత్మక అడుగని అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఈ బిల్లుకు చట్టబద్ధత లభించిన నేపథ్యంలో వివిధ సీనియర్ సిటిజన్స్ సంఘాల ప్రతినిధులు మంత్రిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ చరిత్రలో అరుదైన ఆలోచనగా ఈ నిర్ణయాన్ని కొనియాడారు. వృద్ధ తల్లిదండ్రుల సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శప్రాయమని తెలిపారు. వృద్ధులు ఎదుర్కొంటున్న నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం వంటి సమస్యలకు ఈ చట్టం సమగ్ర పరిష్కారంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. పిల్లలపై నైతిక బాధ్యతతో పాటు చట్టబద్ధ బాధ్యతను కూడా నిర్దేశించడం ద్వారా కుటుంబ వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ బిల్లును సమర్థంగా ముందుకు తీసుకెళ్లడంలో అధికారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్స్ ఈ బిల్లు అమలులో పూర్తి సహకారం అందించాలని కోరారు. వృద్ధుల సంక్షేమంపై సీఎం రేవంత్ రెడ్డి చూపుతున్న కట్టుబాటు అభినందనీయమని కొనియాడారు. ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించిన అనంతరం చట్టరూపం దాల్చనుందని మంత్రి తెలిపారు. అనంతరం వయోవృద్ధుల ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ముఖ్యమంత్రికి ఘన సన్మానం నిర్వహించాలని సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు ప్రతిపాదించగా, మంత్రి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఐఆర్ఎస్ రిటైర్డ్ అధికారి డి. పార్థసారథి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు మంత్రిని శాలువాలతో సత్కరించారు. వృద్ధుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం సాధించడంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అలాగే మహిళా, శిశు సంక్షేమం మరియు సీనియర్ సిటిజన్స్ విభాగాల కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ చట్టం అమలులోకి వస్తే వృద్ధ తల్లిదండ్రులు గౌరవంతో, భద్రతతో జీవించే అవకాశం కలుగుతుందని, కుటుంబ బంధాలు మరింత బలపడతాయని సీనియర్ సిటిజన్స్ సంఘాలు విశ్వాసం వ్యక్తం చేశాయి. వృద్ధుల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణకే కాకుండా దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఇందిరా పార్కులో కబ్జాలకు హైడ్రా చెక్

- పాత స్కేటింగ్ రింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా
- పార్కులో కలపాలని హైడ్రా కమిషనర్ ఆదేశం

**ముద్ర, హైదరాబాద్ :**

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఇందిరా పార్కులో కబ్జాలపై హైడ్రా చెక్ పెట్టింది. పార్కులో వాకింగ్ ట్రాక్‌లతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రదేశాల కబ్జాలపై హైడ్రా కన్నెర్ర చేసింది. పాత స్కేటింగ్ రింగ్ కబ్జాకు గురవుతోందని ప్రజావాణిలో వాకర్స్ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ సామగ్రి నిల్వ చేయడం, ఇందిరా పార్క్ లోపలి వైపు ఉన్న ప్రహరీని తొలగించడం వంటి చర్యలను ఆయన సీరియస్‌గా పరిగణించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులను ఆపించి, ప్రహరీని పునరుద్ధరించాలని ఆదేశించారు. కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పాత స్థలాన్ని ఇందిరా పార్కులో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**-ప్రజావాణి ఫిర్యాదు ఇలా..**

ఇందిరా పార్కులో కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి రావడంతో పాత స్కేటింగ్ రింగ్ ఖాళీగా ఉంది. ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. సమ్మర్ క్యాంప్ పేరుతో కరాటే శిక్షణ ఇస్తానని సఫీ అనే వ్యక్తి ప్రవేశించి, వేసవి కాలం తర్వాత కూడా అక్కడ శిక్షణ కేంద్రాన్ని కొనసాగిస్తూ పిల్లల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాడు. ఇక్కడితో ఆగకుండా కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నించి, ఎమ్మెల్యే నిధులు కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించాడు. ఈ మేరకు రూ.30 లక్షలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. అయితే సంబంధిత శాఖల అనుమతులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



**అనుమతులు లేకుండానే పనులు..**

అనుమతులు రావడానికి ముందే పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డికి పనులు అప్పగించి, నిర్మాణాలకు అవసరమైన స్టీల్ రాడ్లు, ఇతర సామగ్రిని అక్కడ నిల్వ చేశారు. స్కేటింగ్ రింగ్‌లోకి జేసీబీ వెళ్లేందుకు ప్రహరీని తొలగించారు. ఇది జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలోనే జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని భావించిన వాకర్స్ హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అనంతరం హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించారు. దీంతో స్పందించిన అధికారులు ప్రహరీను కూల్చిన రవీందర్ రెడ్డిపై దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సోమవారం హైడ్రా కమిషనర్ పరిణామాలను సమీక్షించి, పాత స్కేటింగ్ రింగ్ స్థలాన్ని ఇందిరా పార్కులో కలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# చిత్తశుద్ధి ఉంటే కుల వ్యవస్థను రద్దు చేయాలి

- పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాష్ట్రపతికి మందకృష్ణ డిమాండ్
- మతం మారితే ఎస్సీ హోదా రద్దు ఉత్తర్వులు తగవు
- ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్య


**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాష్ట్రపతికి చిత్తశుద్ధి ఉంటే దేశంలో కుల వ్యవస్థను రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్రైస్తవ మతంలోకి మారిన తరువాత ఎస్సీ హోదా ఉండదని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. దళితులు క్రైస్తవ మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని పేర్కొన్న తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు చేయడం కంటే దేశంలో కుల వ్యవస్థనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1950లో వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని, అయితే ఆ ఉత్తర్వులే రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఇవి వివక్షతో కూడిన ఉత్తర్వులని విమర్శించారు. కుల వ్యవస్థను రద్దు చేసే చర్యలకు ఏ పార్టీ, ఏ సంస్థ ముందుకు వచ్చినా స్వాగతిస్తామని, వారికి అండగా నిలుస్తామన్నారు. కుల వ్యవస్థలో అత్యంత బాధితులు దళితులేనని, వారిని పశువులకంటే హీనంగా చూడబడుతున్నారని అన్నారు. దేశంలోని కుల వ్యవస్థలో బ్రాహ్మణేతర వర్గాలన్నీ బాధితులేనని పేర్కొన్నారు. కుల వ్యవస్థలో ఏ రెండు కులాల మధ్య సామాజిక సామరస్యత లేదని, అయితే అన్ని కులాలపై ఆధిపత్యం, గౌరవం పొందుతున్నది బ్రాహ్మణ వ్యవస్థేనని వ్యాఖ్యానించారు. కుల వ్యవస్థను రద్దు చేయాలని తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. కుల వ్యవస్థకు మద్దతు ఇస్తున్న వారు, వ్యతిరేకిస్తున్న వారు బహిరంగంగా ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
31.03.2026 మంగళవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# బాధ్యతను గుర్తుచేసే వేతన దండం!!

- **తల్లితండ్రులను చూడని వారికి ఇదో మేలుకొలుపు**
- **తల్లిదండ్రుల సంరక్షణ చట్టం- 2026**

రాష్ట్రంలోని ఏ తల్లిదండ్రులు వారి పిల్లల ఆదరణకు దూరమై అనాథలుగా ఉండకూడదు. చివరి రోజుల్లో బాగోగులు చూసేవారు లేక ఇబ్బంది పడొద్దు అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో భావోద్వేగంతో సామాజిక బాధ్యతతో, " ది తెలంగాణ ఎంప్లాయిస్ ఎకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరంటల్ సపోర్ట్ చట్టం 2026" తెస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి ఒక నెల రోజుల క్రితం అన్నారు. వారు అన్నట్లుగానే ఈ సంవత్సరం 202627 బడ్జెట్ సెషన్ లో మార్చి 29న 'పేరంటల్ సపోర్ట్ చట్టం 2026' బిల్లుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం పొందించింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ " సమాజంలో తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో సాగుతున్న వివక్ష నిర్లక్ష్యం మనం చూస్తున్నాం. అందుకే కన్న వారి బాగోగులు చూడని వారికి గుణపాఠం చెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగులు వారి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారి నెల వేతనములో 15% లేదా రూ.10 వేల మొత్తం కోతపడుతుంది. భక్తితో కాకుండా భయంతోనైనా తల్లిదండ్రుల హక్కులను కాపాడుతారని ఈ చట్టం తీసుకొస్తున్నాం. కేంద్ర చట్టంలోని నిబంధనల వల్ల రూ.10 వేలకు మించి వేతనములో కోత పెట్టడం సాధ్యం కావడం లేదు. నిబంధనలు సడించాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేద్దాం".

**కేంద్ర ప్రభుత్వం ఏమోదించిన వృద్ధుల సంక్షేమ చట్టం-2007:**

" తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం, 2007" ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. ఈ విషయంలో పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లో 125 ప్రకారం తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, చట్టమే వారి పోషణ కయ్యే ఖర్చులను పిల్లలనుంచి ఇప్పిస్తుంది. కానీ పిల్లల మీద ప్రేమ వల్ల కుటుంబ ప్రతిష్ట దిగజారుతుందన్న భయం వల్ల, కేసు లావాదేవీలను నడిపేందుకు ఎంతో కాలాన్ని, డబ్బును హెచ్చించవలసి రావడం వంటి కాణాలతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఈ రకమైన కేసులను వేయడం లేదు. అందుకే పెద్దవారికి అవసరమైన పోషణ సంరక్షణ విషయాలలో సులభమైన వేగవంతమైన న్యాయసహాన్ని అందించేందుకు న్యాయస్థానాలతో సంబంధం లేని ప్రత్యేక చట్టం " తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం,2007 ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ చట్టంను తెలంగాణ ప్రభుత్వం " తెలంగాణ తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి, మరియు సవరణ నియమావళి, 2022" ను రూపొందించింది.కానీ అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఆర్థిక సోలంబన :**

ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం వృద్ధులకు 'ఆర్థిక గౌరవాన్ని' కల్పించడం. ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్లు కేవలం మనుగడకు సరిపోతాయి. కానీ, అనారోగ్యం సమస్యలు ఉన్నప్పుడు లేదా మెరుగైన జీవన ప్రమాణాలు కావాలన్నప్పుడు అవి చాలవు. ఈ నేపథ్యంలోనే, పిల్లల సంపాదనపై తల్లిదండ్రులులకు చట్టబద్ధమైన హక్కును కల్పించడం ద్వారా, వారు ఎవరి ముందు చేతులు చాచాల్సిన అవసరం ఉండదు. 15% జీతం అంటే చిన్న మొత్తం కాదు అది ఒక వృద్ధ దంపతులకు గౌరవప్రదమైన జీవనానికి సరిపోతుంది.

**నైతికత వర్సెస్ చట్టం :**

ఈ నిర్ణయం వల్ల సమాజంలో మిశ్రమ ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. చట్టం పట్ల భయంలేని వారికి, కనీసం ఆర్థిక నష్టం కలుగుతుందనే భయం తోనైనా తల్లిదండ్రులను బాగా చూసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ఒక రకమైన 'బలవంతపు బాధ్యత' అయినప్పటికీ, బాధితులకు న్యాయం జరుగుతుంది. నేడు నగరాల్లో వృద్ధాశ్రమాలు కిక్కిరిసిపోతున్నాయి. పిల్లలు ఉండి అనాథలుగా బతుకుతున్న వారికి ఈ చట్టం ఒక పెద్ద ఊరట. ఇంటిపట్టునే ఉండి, తమకు రావలసిన వాటాను పొందుతూ వారు మనశ్శాంతిగా శేష జీవితం గడపవచ్చు. రాబోయే తరాలకు ఇది ఒక గట్టి సందేశాన్ని పంపుతుంది. కన్నవారిని గౌరవించడం అనేది ఆప్షనల్ కాదు, అది తప్పనిసరి అని ఈ చట్టం గుర్తుచేస్తుంది.

**ప్రభుత్వ ఉద్యోగులపై ప్రభావం- పర్యవేక్షణ**

తెలంగాణలో లక్షలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని కేవలం ప్రభుత్వ రంగంలోనే పరిమితం చేయకుండా, ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థలు, కార్పొరేషన్లకు, స్థానిక సంస్థలకు, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ట్రెజరీ ద్వారా చెల్లిస్తారు. జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత అధికారి ఆదేశాల మేరకు నేరుగా జీతములు కోత విధించడం సాంకేతికంగా సులభం. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు బాధ్యతగల అధికారులు విచారణ జరిపి, నిజంగానే నిర్లక్ష్యం జరుగుతుందని తేలితేనే ఈ చర్య తీసుకోవాలి. ఇది పారదర్శకంగా జరగడం ప్రధానం.

**ఎదురయ్యే సవాళ్లు- ఆందోళనలు :**

ఏ చట్టమైన అమలులోకి వచ్చేటప్పుడు కొన్ని సవాళ్లను ఎదుర్కోక తప్పదు. జీతం కట్ చేసిన తర్వాత, అదే ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు కలిసి ఉండటం కష్టతరమవుతుంది. ఇది మరిన్ని గొడవలకు మానసిక వేదనకు దారితీస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులు తమ ఇతర పిల్లల మాటలు విని లేదా ఆస్తి తగాదాల వల్ల ఒక కొడుకు పై ద్వేషంతో తప్పుడు ఫిర్యాదులు చేస్తే పరిస్థితి ఏంటి? దీనిని అరికట్టడానికి బలమైన 'అప్పిలేట్ అథారిటీ' అవసరం. ఐటీతోపాటు ఇతర ప్రైవేట్ రంగాల్లో పనిచేసే వారిపై రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నియంత్రణ సాధించటం కష్టం. దీనికోసం కేంద్ర చట్టాల సాయం లేదా ప్రత్యేక లేబర్ రూల్స్ సవరించాల్సి ఉంటుంది.

**చట్టం కంటే సంస్కారమే మిన్న:**

మనదేశంలో అస్సాంలో ఇప్పటికే అమల్లో ఉన్న 'ప్రణామ' చట్టం స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ఈ ముందడుగు వేసింది. అక్కడ కూడా ఉద్యోగి జీతం నుంచి 1015 శాతం వరకు వృద్ధాప్య తల్లిదండ్రులకు ఇచ్చే విధంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని మరింత పకడ్బందీగా అమలు చేయాలని చూస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మక అవసరం. ఒకపక్క అభివృద్ధి పదములో దూసుకుపోతున్న తెలంగాణ, మరోపక్క తన సంస్కృతి, సాంప్రదాయాలను కుటుంబ విలువలను కాపాడుకోవడంలో వెనుకబడ కూడదనే తపన ఇందులో కనిపిస్తుంది. కేవలం చట్టం ద్వారా మాత్రమే కుటుంబాల్లో ప్రేమానురాగాలను పెంచలేం. చట్టం అనేది చివరి అస్త్రం కావాలి. తల్లితండ్రులను గౌరవించాలని భావన సమాజంలో లోతుగా పాతుకుపోవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ' 15శాతం' భరోసా, కేవలం డబ్బు రూపంలోనే కాకుండా వృద్ధులకు ఒక 'ఆత్మ గౌరవ చిన్నం' గా నిలవాలి. ఈ చట్టం విజయవంతం కావాలంటే పారదర్శకమైన విచారణ వ్యవస్థ, వేగవంతమైన న్యాయం, సామాజిక అవగాహన ముఖ్యం. కన్నవారి కన్నీరు తుడిచే ఈ 'తల్లిదండ్రుల పోషణ బిల్లు' అక్షరాల అమల్లోనికి వస్తే వృద్ధాప్యంలో ఉన్న ఎందరికో అది నిజమైన ఆసరా అవుతుంది.



*ఉజ్జిని రత్నాకర్ రావు
-9490952646
సీనియర్ సిటిజెన్స్
వెల్ఫేర్ అసోసియేషన్



# ఇరవై ఏళ్లకే ఇల వీడిన వీరకిశోరాలు

## తెలంగాణ పోరు గడ్డపై పసునూరి, ముస్కు అమరత్వం!

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో యువ కిశోరాలు...**

**రక్తతర్పణానికి 78 ఏళ్లు!**

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం విద్యార్థి దశలోనే చదువులకు స్వస్తి చెప్పి పోరుబాట పట్టిన చెర్వు అన్నారం వీరులు పసునూరి వెంకట్ రెడ్డి, ముస్కు వెంకట్ రెడ్డి 1948 ఏప్రిల్ 12న రజాకార్ల దమనానికి బలై అమరులయ్యారు. పెడరెక్కలు విరిచి చెట్టుకి కట్టి కాల్చి చంపిన ఆ క్రూర ఘటనకు నేటికి 78 ఏళ్లు. వారి త్యాగజ్యోతి చెరగలేదు. వారు రక్తం చిందించిన నేల నేడు పచ్చని పొలాల మధ్య అమరవీరుల స్మారక స్థూపంగా నిలిచి ప్రతి ఏడాది వర్ధంతి రోజున 78 ఏళ్లుగా జాతరగా జరుగుతుంది.

ఈ అమరవీరులకు చెర్వు అన్నారంతో ఎలాంటి రక్త సంబంధం లేదు, వారసత్వ పేచీ అంతకంటే లేదు. కానీ వారిని అనుసంధానించింది కేవలం ఎర్ర జెండా పెనవేసిన విప్లవ బంధం మాత్రమే! సొంత బంధువులనే విస్మరిస్తున్న నేటి స్వార్థపూరిత కాలంలో ప్రజల కోసం ప్రాణాలర్పించిన ఆ మహనీయుల త్యాగాన్ని గౌరవిస్తూ తరతరాలుగా ఈ ప్రాంత ప్రజలు అమరుల త్యాగాన్ని గుండెల్లో దాచుకుని ఘనంగా వర్ధంతి నిర్వహించడం వారి పట్ల ఉన్న అపారమైన గౌరవానికి నిదర్శనం. వ్యక్తులను కాల్చివేయగలిగినా ఆశయాలను చంపలేమని చరిత్ర చెబుతుంటే ప్రజల కోసం ప్రాణాలు అర్పించినవారు ఎప్పటికీ జీవిస్తారనే సత్యానికి పసునూరి, ముస్కు వెంకట్ రెడ్డి ల అమరత్వం చిరస్మరణీయ సాక్ష్యంగా నిలుస్తోంది.పసునూరి వెంకట్ రెడ్డి కేతేపల్లి మండలం కాసనగోడు గ్రామానికి చెందినవాడు. ముస్కు వెంకట్ రెడ్డి నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందినవాడు. గ్రామాలు వేరైనా లక్ష్యం ఒక్కటే. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య సారథ్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పిలుపును అందుకొని ప్రజల విముక్తి కోసం, రజాకార్లను తరిమికొట్టడం కోసం ఎర్రజెండా నీడలో ఇద్దరూ ఏకమయ్యారు. అనేక గ్రామాలను విముక్తి చేసి పేద ప్రజలకు అండగా నిలబడ్డారు. అణగారిన కుటుంబాల్లో వెలుగు దీపాలుగా నిలిచారు. వారి త్యాగం చిరస్మరణీయం, వెలకట్టలేనిది. వారిని చంపగలిగినా వారి ఆశయాలను చంపలేకపోయారు. ప్రజల కోసం చనిపోయిన వారు ఎల్లకాలం జీవిస్తారనే నగ్నసత్యాన్ని వారి జీవితం నిరూపించింది.

1946 సెప్టెంబర్ 11న ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నకిరేకల్ ప్రాంతం కీలక కేంద్రంగా నిలిచింది. మంగళపల్లి, కాసనగోడు, బొప్పారం, నోముల, కొప్పోలు, తుంగతుర్తి తదితర గ్రామాలకు చెందిన యువకులు దళాల్లో చేరి పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం పోరాటం సాగించారు. సుమారు 150 మంది వివిధ దళాల్లో పనిచేసి రజాకార్లకు ఎదురు నిలబడ్డారు. రజాకార్ల కాల్పుల్లో 58 మంది అమరులయ్యారు. గ్రామాలు ఉద్యమ కేంద్రాలుగా మారి ప్రజలు భూస్వామ్యానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడారు. ఎర్రజెండా చైతన్యంతో ప్రజలు ఒకటై నిజాం నిరంకుశ పాలనకు సవాల్ విసిరారు.

సంఘటిత విద్యార్థి నిర్మాణంలో పీ.వీ ఒకరు. విద్యార్థి సంఘాన్ని జిల్లాలో విస్తరించడానికి కీలకపాత్ర పోషించాడు. విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రజా పోరాటాల వరకు పసునూరి వెంకట్ రెడ్డి కీలక పాత్ర వహించాడు. ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ద్వారా విద్యార్థి నాయకుడిగా ఎదిగి నల్లగొండ జిల్లాలో చైతన్యం నింపాడు. జెండా సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడు. అనంతరం అజ్ఞాత జీవితం గడుపుతూ ప్రజా పోరాటాలను కొనసాగించాడు. ఆయన ధైర్యసాహసాలు రజాకార్లకు భయానకంగా మారాయి. ముస్కు వెంకట్ రెడ్డి కూడా ప్రజల మధ్య తిరుగుతూ ఉద్యమాన్ని బలోపేతం చేశాడు. ఇద్దరూ కలసి అనేక గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసి దొరల దమనానికి చెక్ పెట్టారు.

వీరులను ఎదురుగా ఢీకొనే ధైర్యం లేక శత్రువులు కుట్రలకు దిగారు. ఇద్దరు నమ్మదగిన వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో రజాకార్లు చెర్వు అన్నారం గ్రామంపై దాడి చేశారు. పసునూరి వెంకట్ రెడ్డి, ముస్కు వెంకట్ రెడ్డిలను పట్టుకుని వీధుల వెంట ఈడ్చుకుంటూ ఊరి చివరనున్న వేపచెట్టుకు కట్టేసి పెడరెక్కలు విరిచి కాల్చిచంపారు. వీరితోపాటు చుట్టుపక్క గ్రామాలలో రాచకొండ ఎల్లస్వామి, గండమల్ల నరసింహ, మిట్ట లింగారెడ్డిని చిత్రహింసలు పెట్టి కాల్చిచంపారు. అప్పటికి పసునూరి, ముస్కు వెంకట్ రెడ్డిల వయస్సు ఇరవై సంవత్సరాల లోపే. రజాకార్ల తూటాలు వారి శరీరాలను



ఛేదించినా వారి ఆశయాలను మాత్రం ఆర్పలేకపోయాయి. ఆ రక్తధారలు చెర్వు అన్నారం నేలను పునీతం చేశాయి. వారు స్ఫూర్తితో అనేక ఉద్యమాలకు కేంద్ర బిందువు అయ్యింది. అనేక మంది కార్యకర్తలు నాయకులు ప్రజా ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. అన్నారం ప్రజలు ఎర్రజెండా అండదండలు అందించారు అనేకమంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు ప్రజల పక్షాన నిలబడి. పాలకుల విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గళం విప్పారు. అభివృద్ధికి అడుగులు వేశారు.ప్రజల బానిస సంకెళ్లు తెంచి వెట్టిచాకిరి నిర్మూలన కోసం ప్రాణాలు అర్పించిన వీరుల జ్ఞాపకార్థం చెర్వు అన్నారం గ్రామంలో స్మారక స్థూపం నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వర్ధంతి సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి నివాళులు అర్పిస్తున్నారు. ప్రత్యేక పండుగలు మర్చిపోయినా అమరుల వర్ధంతిని మాత్రం జాతరగా నిర్వహించడం ఈ ప్రాంత ప్రజల ప్రత్యేకతగా మారింది. పాటలు, నినాదాలు, జెండాలతో గ్రామం మొత్తం చైతన్యంతో మార్మోగుతోంది. ఇది కేవలం జ్ఞాపకం కాదు, పోరాట స్ఫూర్తికి ప్రతీక. ఈ స్థూపం ఇటీవల కాలంలో కొంత శిథిలావస్థలోకి చేరింది. దీన్ని పునర్నిర్మాణం కోసం ఆ ఊరి ప్రజలు, ఎర్రజెండా ప్రయత్నిస్తుంది. పూర్వ వైభవం తీసుకోవడానికి రావడానికి అడుగులు వేస్తుంది.

పసునూరి ముసుకు వెంకట్ రెడ్డి చరిత్రను పుచ్చలపల్లి సుందరయ్య రాసిన వీర తెలంగాణ విప్లవ పోరాట గుణపాఠాలు, వీర తెలంగాణ మాది, వీర తెలంగాణ పోరాట గాథలు, సైసై ఓ నల్గొండ వీరుడా, సిపిఎం నకిరేకల్ 50 వసంతాల స్వర్ణోత్సవ పుస్తకాల్లో చరిత్రను లిఖించబడ్డాయి. గతంలో అనేకసార్లు చెర్వు అన్నారం ఘనంగా అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. ఈ సభలకు పార్టీ సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, పుణ్యవతి వీర వనిత తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, మరెందరో రాష్ట్ర జిల్లా నాయకులు హాజరయ్యారు. చెర్వు అన్నారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మందుల విప్లవ కుమార్ సారథ్యంలో రూపొందించిన అమరవీరుల స్మృతి గీతాలను ఆదర్శ నేత నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి హాస్పటల్ వైద్యం పొందుతూ ఫోన్ ద్వారా మల్లు స్వరాజ్యం ప్రత్యక్షంగా పాటల క్యాసెట్ విడుదల చేశారు. నేటికీ ఆ గీతాలు ప్రతిధ్వనిలా వినిపిస్తూనే ఉంటాయి.రక్తాక్షర సంతకాలతో రాసిన ఈ సాయుధ సంగ్రామ చరిత్రను బావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన ఈ యువ వీరుల త్యాగం నేటి తరానికి మార్గదర్శకం. మత విద్వేషాలు, కుల వివక్ష, గంజాయి మత్తు, అవినీతి, మహిళలపై దాడులు వంటి రాజకీయాలు సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు చేస్తున్న ఈ కాలంలో వారి ఆశయాలను కొనసాగించడం అత్యవసరం. ప్రజల హక్కులను కాపాడడం, అన్యాయాలకు ఎదురు నిలబడడం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, సమ సమాజ నిర్మాణం కోసం బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, సమస్త ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంవారి వారసత్వాన్ని కొనసాగించడం అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కావడం కూడా ఆ అమరుల ఆశయాలకు నిజమైన నివాళి. ఇరవై సంవత్సరాల లోపే ప్రాణాలు అర్పించిన పసునూరి వెంకట్ రెడ్డి, ముస్కు వెంకట్ రెడ్డి, రాచకొండ ఎల్లస్వామి, గండమల్ల నరసింహ, మిట్ట లింగారెడ్డి త్యాగం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచింది. వారిని శరీరంగా అంతమొందించినా వారి ఆశయాలను మాత్రం ఎవరూ చెరపలేకపోయారు. చెర్వు అన్నారం వేపచెట్టు కింద కారిన రక్తం కేవలం గతం కాదు... అది పోరాట పిలుపు. ఆ రక్తాక్షర సంతకాలు చెరిగిపోవు. ఆ త్యాగం మరువలేం. ప్రజల కోసం చనిపోయిన వారు ఎల్లకాలం జీవిస్తారనే నగ్న సత్యాన్ని ఈ నేల తరతరాలకు చెబుతూనే ఉంటుంది. వారి జ్యోతి వెలుగుతూ ఉండాలి...వారి పోరాటం ముందుకు సాగాలి... వారి ఆశయాలతో సమ సమాజం నిర్మించడమే వారికి ఇచ్చే నిజమైన జోహార్లు.

గడగోజు
రవీంద్రాచారి.
రచయిత.
9848772232



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 31.03.2026
www.mudranews.in | @mudranews



# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 186 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్.పి సి ఈ ఓ సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్ డి ఓ వాసు చంద్ర, అధికారులు పాల్గొన్నారు.

**నేటి ప్రజావాణికి 41 దరఖాస్తులు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 దరఖాస్తులు వచ్చినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జీవి శ్యాంప్రసాద్ లాల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిటిజన్ ఫోరం సభ్యులు సిటిజన్ ఫోరం సభ్యులు వి. రాజశేఖర్ శర్మ, వెంకటయ్య కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

**సమస్యల పరిష్కార వేదికగా ప్రజావాణి**

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రజావాణి కేవలం దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంలా కాకుండా సమస్యలు పరిష్కరించే వేదికగా పనిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి 33 దరఖాస్తులు అందాయి. వివిధ ప్రాంతాల ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతి పత్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డితో కలిసి



స్వీకరించారు. రెవెన్యూ శాఖవి 8, ఇతర శాఖలవి 25, మొత్తం 33 దరఖస్తులు అధికార యంత్రాంగానికి అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**చెరువులను కాపాడండి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** ఏనుగొండ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న మోదుగుంట చెరువు శిఖం, ఎఫ్ఎఎల్ పరిధిలోని భూములను రియాల్టర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు జాతీయ బిసి మహాసభ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ ముదిరాజ్, ఉమ్మడి పురుషోత్తం మున్నూరు కాపు





సంఘం అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ లు సోమవారం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, చెరువు భూములను రక్షించాలని వారు కోరారు.

# 'రఘురామదాసు భజన కీర్తనలు' పుస్తకావిష్కరణ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రముఖ కవి, పండితులు కర్నాటి రఘురాములు గౌడ్ రచించిన "రఘు రామదాసు భజన కీర్తనలు" గ్రంథాన్ని సోమవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ రఘురాములు గౌడ్ రచనల్లో భక్తి, శాంతి, సామాజిక, రాజకీయ భావాల సమన్వయం స్పష్టంగా కనిపిస్తుందని కొనియాడారు. కల్వకుర్తి తాలూకా గుండ్ల గంటపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడైన ఆయన దాదాపు 40 ఏళ్లుగా రచనలు చేస్తూ వస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 33 పుస్తకాలను రచించి ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా రచయితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనపట్ల సుబ్బయ్య, సీనియర్ పాత్రికేయులు కందికొండ మోహన్, వహీద్ ఖాన్ పాల్గొన్నారు.

# ఉప్పల్ రహదారికి బండారి రాజిరెడ్డి పేరు



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్‌కు "శ్రీ బండారి రాజిరెడ్డి కారిడార్"గా పేరు పెట్టుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమన్నారు.

# జనగణనను సమర్థవంతంగా నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో నిర్వహించే జనగణన విధులను సక్రమంగా అమలు చేయాలని, ప్రక్రియ నిర్వహణతో పాటు సాంకేతికత వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. సోమవారం హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన డిజిటల్ శిక్షణలో కలెక్టర్, రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికెరి, కలెక్టర్లు, ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత, మాస్టర్ ట్రైనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగులు సమాజసేవలో భాగం కావాలి

**ముద్ర, గద్వాల జిల్లా ప్రతినిధి:** విశ్రాంత ఉద్యోగులు తమ శేష జీవితంలో కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా యువజన క్రీడల అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న డీవైఎస్ఓ కృష్ణయ్య ను సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో కలెక్టర్ సన్మానించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఆయన సేవలు అవసరమైతే వినియోగించుకుంటామన్నారు. అనంతరం కృష్ణయ్యను సన్మానించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పథకానికి ఏడాది

**ముద్ర కూకట్‌పల్లి :** 'పేదలకు సన్నబియ్యం పంపిణీ' పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్‌లో ఎన్.టి.ఆర్ నగర్ కాలనీకి చెందిన వి.శ్రీనివాస్ అనే దివ్యాంగుని కుటుంబం మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ను తమ నివాసానికి ఆహ్వానించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యంతో స్వయంగా భోజనం వండి, వెంకటేష్ గౌడ్‌కు వడ్డించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

# రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేత

**ముద్ర కూకట్‌పల్లి:** బోరబండ డివిజన్ శివయ్య బస్తీలో పర్యటించిన సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, చెత్త పేరుకుపోవడంపై ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

# పెయింట్ షాపులో అగ్నిప్రమాదం

**ముద్ర, గద్వాల:** జిల్లా కేంద్రంలోని చిన్న అగ్రహారం సమీపంలో గల ఎం.నారాయణ కాంప్లెక్స్ లో ఓ పెయింట్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే షాపులోని పెయింట్ డబ్బాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

# ఆస్తి పన్ను వసూళ్ల కోసం వినూత్న నిరసన

**ముద్ర, తాండూర్:** తాండూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లించకుండా ఉన్న మొండి బకాయి దారుల కోసం మున్సిపల్ అధికారులు తమ దైన శైలిలో చెత్త సేకరణ వాహనాలతో పెట్రోల్ బంకు ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విలేమున్ చౌరస్తా దగ్గర ఉన్న పెట్రోల్ బంక్ యజమాని ఐదు సంవత్సరాల నుండి రూ.82 వేలు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. పలు మార్లు నోటీసులు పంపించిన స్పందించకపోవడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో నిరసన వ్యక్తం చేశారు.

# ఇంటర్ పూర్తయిన వారికి ఉచిత ఇంటర్న్‌షిప్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో నెలరోజుల ఉచిత ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్, కృత్రిమ మేధస్సు(ఏఐ) సహాయంతో ఎంఎస్-ఆఫీస్ బేసిక్స్, వ్యక్తిత్వ వికాసం, తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలు, సాహిత్యంపై శిక్షణ అందించబడుతుంది. ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6302057411, 81792 26268 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# జీవో 25 సవరణ చేయాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 25ను సవరించి ఉపాధ్యాయుల రేషనలైజేషన్, బదిలీలను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం మురళి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం వెలమ సంఘం ఫంక్షన్ హాల్‌లో జిల్లా శాఖ అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన నిర్వహించారు.

# ఇసుక డంపులు సీజ్

**ముద్ర, గద్వాల:** అయిజ మండలం తుంగభద్ర నదీ తీరాన ఉన్న పులికల్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్టు తహసీల్దార్ జ్యోతి తెలిపారు. తుంగభద్ర నదీతీరాన సమీపంలో గల పులికల్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు 40 ట్రిప్పుల ఇసుకను డంప్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ జ్యోతి ఆదేశాల మేరకు రెవెన్యూ పోలీస్ అధికారులకు ఆకలిసి వెళ్లి ఇసుక డంపులను పరిశీలించారు. అనంతరం వారి సమక్షంలోనే ఇసుక డంపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ నదీ తీరం నుంచి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అన్ని శాఖల ప్రగతి వివరాలు ప్రస్తావించాలి



**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గ్రామసభల్లో అన్ని శాఖల్లోని అభివృద్ధి కార్యక్రమాల పూర్తి వివరాలను ప్రస్తావించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మాట్లాడారు. మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించాలని, ప్రతి శుక్రవా రం అక్కడే భోజనం చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ భర్తను పరామర్శించిన ఎమ్మెల్సీ



**ముద్ర, తాండూర్:** అనారోగ్యంతో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామ మాజీ సర్పంచ్ నవనీత భర్త సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించారు. సుదర్శన్ రెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజవర్ధన్ రెడ్డి,నాగరాజు ఉన్నారు.

# సన్మానం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణికి, అలాగే ఇటీవల పదోన్నతి పొందిన హెడ్ నర్స్ కృష్ణవేణికి నర్సింగ్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో సన్మా నించారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఎంపికైన ప్రముఖ పీడియాట్రిక్ విభాగానికి చెందిన 8 మంది వైద్యుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఉషారాణి, కలకత్తాలో జరిగిన నియోకాన్ ఫెలోషిప్ 44వ వార్షికోత్సవ జాతీయ సదస్సులో అవార్డు అందుకున్నారు. సర్జికల్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రఘు, ఆర్.ఎం.ఓ డాక్టర్ ఏ. రోహిత్, నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజుల, పెర్సీ సుమన్, హెడ్ నర్సులు అమృత, పద్మ, నర్సింగ్ ఆఫీసర్ల జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆనంద్, నర్సింగ్ అధికారులు సరస్వతి, అనురాధ, సునీత, కేశవ్, అంజి పాల్గొన్నారు.

# అంజన్న హుండీ ఆదాయం రూ.10 లక్షలు

**ముద్ర, గద్వాల:** ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ. 10,73, 245 వచ్చినట్లు ఆలయ ఈఓ కవిత తెలిపారు. గత సంవత్సరం తో పోలిస్తే ఈ సంవత్సరం రూ.1,35,045 ఆదాయం అదనంగా సమకూరిందని వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరీ, ఆలయ ఈఓ కవిత ఆలయ ధర్మకర్త గిరిరావు ఆధ్వర్యంలో మొదలుపెట్టారు. భీంపురం గ్రామ సర్పంచ్ గాళ్ల రఘు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**నారాయణపేట కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ముద్ర, నారాయణపేట:** డ్రగ్స్ అనేవి టెర్రరిస్ట్ లాంటివనీ, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయా కళాశాలలకు చెందిన యువతకు మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థాయిలో నిలవాలని సూచించారు. డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్ ను ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా




వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామాగ్రీలు అందజేశారు. రాష్ట్ర ఈగల్స్ ఫోర్స్ డి.ఎస్.పి పుష్పన్ కుమార్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, గాయత్రి, కృష్ణ చైతన్య, గురవయ్య పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుంచి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. గద్వాల్ డి.ఎస్పీ. వై మొగిలయ్య,



గద్వాల్ శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, ప్రదీప్, టాటాబాబు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి మొత్తం 7 మంది ఫిర్యాదుదారులు



హాజరయ్యారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై ఆలస్యం లేకుండా స్పందించాలని ఎస్పీ సూచించారు.

# డాక్టర్ ఏ ఎస్ రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

**ముద్ర, కాప్రా:** మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు ఆశయ సాధనకు కృషి చేయాలని డాక్టర్ ఏఎస్ రావు నగర్ హౌసింగ్ సొసైటీ పర్సనల్ ఇన్చార్జ్ ఈశ్వరయ్య, దాశరథి థియేటర్ అధ్యక్షుడు ఎస్ వినయ్ కుమార్ అన్నారు. మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలింకు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా జి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన అభినంద న సభలో ప్రసంగించారు. ఆయన గొప్పత నాన్ని ప్రపంచానికి చాటాలనే లక్ష్యంతో ఆయన నిజ జీవితాన్ని డాక్యుమెంటరీగా సినిమాను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఫిలింకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గద్దర్ అవార్డు అందుకో వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈసీఐఎల్ సంస్థను స్థాపించి ఎలక్ట్రానిక్స్ రంగంలో



దేశానికి విశిష్ట సేవలు అందించిన మహానుభావుడు అని కొని యాడారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ ఎంతో గొప్ప స్థానంలో ఉన్నప్పటికీ సాధారణ జీవితాన్ని గడుపుతూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం ఫిల్మ్ లో నటించిన కళాకారులకు, చిత్ర యూనిట్ సభ్యులను సన్మానించి జ్ఞాపికలతో అభినందించారు. దాశరథి థియేటర్ ఉపాధ్యక్షులు భూపతి వెంకటేశ్వ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలో దీక్షిత ప్రతిభ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా సిర్సవాడ గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని దీక్షిత రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటింది. రాష్ట్ర భాషోపా ధ్యాయ సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలలో ఆమె ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చిన దీక్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెల్లంపల్లి రమేష్ ఉపాధ్యాయ బృందం, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వాస శ్రీదేవి, ఉప సర్పంచ్ తిరుపతయ్య, ఏపీసీ చైర్‌పర్సన్ భూలక్ష్మమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆశ వర్కర్ల నిరసన ప్రదర్శన



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** బీఆర్టీయూ తెలంగాణ ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బిఆర్ టి యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లకి రూ.18 వేలు నెలకు ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, రెండున్నరేళ్లు గడుస్తున్న ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేరని ప్రశ్నించారు. మార్చి 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు సంపూర్ణంగా సమ్మె చేస్తుంటే, పెండింగ్ లో ఉన్న మూడు నెలల జీతాలు ఇవ్వకుండా, అలాగే పెంచుతాలమన్న జీతం పెంచకుండా, ఆశాల సమస్యల పట్ల ఏ మాత్రం పరిష్కార దిశగా చర్యలు తీసుకోకపోగా, కక్ష సాధింపు చర్యలకు దిగడం, పట్ల ఆశా కార్యకర్తలు ఆగ్రహానికి, గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి అనిత, ఇందిరా, శ్యామల, అనురాధ, జ్యోతి నరసమ్మ, జమునా బాయి. విజయలక్ష్మి లావణ్య రాధిక లక్ష్మి అనూష, అనిత మరియు జిల్లాలోని ఆశా కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1న శ్రీ మహాలక్ష్మి యాగం

**ముద్ర, కూకట్‌పల్లి:** శ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునక్షత్రం పురస్కరించుకుని కూకట్‌పల్లిలోని శ్రీ చిత్తారమ్మ దేవస్థానంలో శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహించనున్నట్లు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ 1న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించే ఈ పవిత్ర యాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# చలివేంద్రం ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీసీ డీఎం, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమే శ్ ప్రారంభించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 31.03.2026
www.mudranews.in | @mudranews



**పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..**

శ్రీకాళహస్తిలో కొలువుదీరిన అమ్మ వారు జ్ఞానప్రసూనాం బగా ప్రసిద్ధి, ఈ క్షేత్రం జ్ఞానాన్ని ప్రసాదించే స్థలంగా భావిస్తారు.



# సీఎంను విమర్శిస్తే ఊరుకోం

### - పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం



**ముద్ర, కరీంనగర్:** మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, గడ్డం నాగరాజుతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ జీవన్ రెడ్డిని నలభై ఏళ్ల నుంచి కడుపులో పెట్టుకొని చూసుకుంటే ఆయన పార్టీకి చేసింది శూన్యమని పేర్కొన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలకు జీవన్ రెడ్డి అడ్డుపడ్డాడని మండిపడ్డారు. సుద్దాల దేవయ్యను కాంగ్రెస్ పార్టీలోకి ఆయనే తీసుకువచ్చారన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఒక మీడియా ఛానల్ ద్వారా తనపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాలలో పార్టీ శ్రేణులకు కోసం ఆయన ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎంత మందిని గెలిపించారో ప్రకటించ లన్నారు. ఆయన సొంత పనులు చేసుకున్నారని ఆరోపించారు. జగిత్యాల ప్రజలకు చేసింది సున్నా అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగిన ఆయన బీసీ, ఎస్సీ, మైనారిటీలు, అగ్ర కులాల పేద బిడ్డలకు న్యాయం చేయలేదని విమర్శించారు. సీఎంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ ద్వారా ఎదిగిన ఆయన పార్టీ పై విమర్శలు చేయడం తగ దన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన ఏం త్యాగం చేశారో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీగా నాటి సీఎం కేసీఆర్ తో చేతులు కలి పి కాంగ్రెస్ ను మోసం చేసి రూ.500 కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. జీవన్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలన్నారు.

# కొండగట్టులో పకడ్బందీ ఏర్పాట్లు

### - కలెక్టర్ సత్యప్రసాద్

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లాలోని కొండగట్టులో ఏప్రిల్ 1 నుంచి 3 వరకు జరగనున్న చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్ప్ సెంటర్, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ ల ఏర్పాటు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. దీక్ష విరమణ, ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధి కారులకు సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొండ పైన వైద్య సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీపీవో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, తహసీల్దార్లు. ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశం కోసం పోటీలు



**మహాదేవపూర్, ముద్ర:** స్పోర్ట్స్ స్కూల్ లో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం సోమవారం అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. అన్ని మండలాలకి చెందిన బాల బాలికలకు ఎత్తు, బరువు, 800 మీటర్ల పరుగు, 6 x 10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, మెడిసిన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ అనే తొమ్మిది రకాల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిబ కనబర్చిన 10 మంది బాలురను, 10 బాలికలను రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపి కు పంపనున్నట్లు భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల అధికార చిర్ర రఘు తెలిపారు.

## రోడ్డుపై బాధ్యతగా వెళ్లాలి




**బోథ్, ముద్ర:** రోడ్డుపై బాధ్యతగా వెళ్లాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు డీజీపీ డి. శివధర్ రెడ్డి ప్రారంభించబడిన "అరైవ్ అలైవ్" లో భాగంగా సోమవారం బోథ్ మండల కేంద్రంలోనీ పరిచయ గార్డెన్ లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, లారీ, కార్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. .ఉచిత కంటి పరీక్ష లో బోథ్ చెందిన 330 మంది ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లు పాల్గొన్నట్లు తెలిపారు. వీరందరికీ నిష్ణాతుడైన కంటి వైద్యులు రామకృష్ణ ఎంఎస్ ఆప్తమాలజీ, వైద్య పరీక్షలను నిర్వహించినట్లు, ఎస్పీ ప్రత్యేకంగా పరీక్షలను పరిశీలించి, నిరుపేద 50 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను ఇచ్చారు. నలుగురికి ఆదిలాబాద్ లో శస్త్ర చికిత్స అందించనునట్లు తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, స్థానిక నాయకులు ఆడే గజేం దర్, బోథ్ సీఐ డి గురుస్వామి, ఎస్ఐ లు వి పురుషోత్తం,జి సంజయ్, అసోసియేషన్ అధ్యక్షుడు పెం చాల వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంత రాజ్, ఆత్మ చైర్మన్ గొల్ల రాజు, స్థానిక సర్పంచ్ అన్నపూర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలి

### - డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్



**ముద్ర, కరీంనగర్:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజు హుస్సేన్ మండిపడ్డారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని, కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరును నిరసిస్తూ సిరాజు హుస్సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి వ్యక్తులు శాసనసభలో ఉండడం ప్రమాదకరమన్నారు. వెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజల సమస్యలను చర్చించే పవిత్ర వేదిక అయిన అసెంబ్లీలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన స్థానంలో ఉండి, ప్రజా ప్రతినిధిగా ప్రవర్తన సరిగా లేకపోవడం బాధాకరమన్నారు. సీనియర్ నేతగా, సీనియర్ ఎమ్మెల్యేగా, పలుమార్లు మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి పట్ల హావభావాలు చేస్తూ కించపరచడం సరైనది కాదన్నారు. ఆయనకు వెంటనే బేషరతుగా కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి కాంట్రవర్సీ చేయడం కౌశిక్ రెడ్డికి అలవాటుగా మారిందని, పత్రికల్లో హైలెట్ కావడం రివాజ్ గా మారిందన్నారు. గతంలో గవర్నర్ గా పనిచేసిన తమిళసై పట్ల చులకనగా మాట్లాడడం, ఎవరిని లెక్క చేయకపోవడం, ఇటీవల సీపీ గౌష్ ఆలం పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి నాయకుడు నైతిక విలువలను పాటిస్తూ, ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కానీ ఇటువంటి ఘటనలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉంటాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

# పథకాల పురోగతిని వివరించాలి

### - కలెక్టర్ రాహుల్ శర్మ




**మహాదేవపూర్, ముద్ర:** గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ పథకాల పురోగతిని ప్రజలకు వివరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగ తి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 న అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభల నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభల నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాభితా చదివి పినిపించాలని ఆయన ఆదేశించారు. నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సమా వేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి దరఖాస్తును పరిశీలించాలి..**

ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### - అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజావాణిలో వచ్చిన అభ్యర్థనలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో అద నపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి





**ముద్ర, కోరుట్ల:** ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్"లో భాగంగా సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన లారీ, ఐచర్, ఇతర భారీ వాహనాల డ్రైవర్లు, యజమానుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యత, రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమన్నారు. నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని చెప్పారు. అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కన నిలిపే సందర్భాల్లో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. కార్యక్ర మంలో భాగంగా ఎస్పీ స్వయంగా లారీలు, వ్యాన్ వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించి డ్రైవర్లకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అశోక్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్ బాబు, అనిల్ కుమార్, కోరుట్ల ఎస్సైలు చిరంజీవి, రామచంద్రం, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్ ఎస్సైలు కిరణ్, శ్రీధర్ రెడ్డి, రవికిరణ్, లారీ, వ్యాన్ అసోసియేషన్ సభ్యులు, యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## అవార్డులు అధికారుల కృషికి గుర్తింపు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** అవార్డులు అధికారుల కృషికి గుర్తింపు నిస్తాయని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిర్మల్ జిల్లాకు ఇటీవల రెండు స్కోచ్ అవార్డులు లభించిన నేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాదులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. పొనికివనం ఏర్పాటు,అమ్మ రక్షిత కార్యక్రమం అమలు విజయవంతంగా కొనసాగిస్తున్నందుకు అధికారులను మెచ్చుకున్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లాలో వినూత్న కార్యక్రమాలు అమలు పరిచేందుకు ప్రోత్సాహం అందిస్తూ మార్గ నిర్దేశం చేసిన ముఖ్యమంత్రికి, మంత్రులు జూపల్లి, సీతక్క, దామోదర రాజ నరసింహలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో డీఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్ తదితరులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 31-03-2026
www.mudranews.in | @mudranews



పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..
శ్రీకాళహస్తిని ముందుగా దర్శించుకున్నా, మధ్యలో దర్శించుకున్నా ఎలాంటి దోషం లేదా అపశకునం జరగదని స్పష్టంగా చెప్పవచ్చు.



# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

**- అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా కార్యక్రమం**

**- అవసరమైన వారికి కంటి అద్దాల పంపిణీ**



**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

'ఆరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ నందు వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు, కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మంచివారికి పోలీసు మిత్రుడు, ఫ్రెండ్లీ పోలీస్, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉంటాం, ప్రజల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు ప్రధాన సమస్యగా మారాయని, వీటి నివారణకు జాగ్రత్తలు పాటించడంతో పాటు అవగాహన ముఖ్యం అన్నారు. మాదకద్రవ్యాల మత్తుకు బానిసలు కావద్దు, మత్తులో నేరాలు చేస్తారని అన్నారు, డ్రగ్స్ లాంటి వాటి కార్యకలాపాల వివరాలు వార్డు, గ్రామ పోలీసు అధికారులకు, డయల్ 100కు సమాచారం అందించి డ్రగ్స్ నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు. డ్రైవర్లు కంటి చూపు అశ్రద్ధ చేస్తున్నారని ఉద్దేశంతో డిజిపి పిలుపు మేరకు ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణంలో పోలీసుల అధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిభిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిభిరంలో కోదాడ పట్టణానికి చెందిన అశోక్ కంటి హాస్పిటల్, పుల్లురి కంటి హాస్పిటల్, సురభి కంటి హాస్పిటల్, లక్ష్మి కంటి హాస్పటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా 500 వందలకు పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుధీర్, కంటి డాక్టర్లు అశోక్ కుమార్, మల్లీశ్వరి, రామ తులసి, రామ్ చరణ్, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖ 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2, మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి ,జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయవద్దు

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు.



సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 33 దరఖాస్తులు, డీఆర్డీఏ 6, డీపీఓ 5, డిడబ్ల్యూఓ 5, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయని వాటిని శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామారావు, సీఈఓ జిల్లా పరిషత్ శిరీష, రెవెన్యూ డివిజన్ అధికారి వేణు మాధవరావు, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల రాస్తారోకో

**ముద్ర, చిట్యాల:**



అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ళే ఆశా వర్కర్లపై సర్కారు నిర్బంధాన్ని నిరసిస్తూ చిట్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ లు మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి ముందుగా అనుమతి ఇచ్చిన ప్రభుత్వం తర్వాత ఆశా వర్కర్ల ఇండ్ల వద్దకు వెళ్ళి ముందస్తు అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న ఆశా వర్కర్లకు అదనపు పనులు చెబుతూ వారిచే వెట్టిచాకిరి చేపిస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని అన్నారు. ఆశా వర్క ర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు అందించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నార్కట్ పల్లి మండల కన్వీనర్ బొబ్బల అరుణజ్యోతి, ఆశా వర్కర్ల సంఘం చిట్యాల, నార్కట్ పల్లి మండల నాయకులు లక్ష్మి, నీరజ, పద్మ, వాణి, గుత్తా సరిత, వేముల అరుణ, నీలమ్మ, రేణుక, శైలజ, జయమ్మ, శోభ పాల్గొన్నారు.

# భువనగిరి మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

**- రూ. 55.73 కోట్ల అంచనాలతో అభివృద్ధి వైపు అడుగులు**




**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మున్సిపల్ 2026-27 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ ను కౌన్సిల్ ఏక గ్రీవంగా ఆమోదించింది. సోమవారం మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ ప్రత్యేక సమావేశం, అత్యవసర కౌన్సిల్ సమావేశం విజయవతంగా ముగిసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, కౌన్సిల్ సభ్యులందరూ రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. వార్డుల్లో నెలకొన్న మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మున్సిపాలిటీ స్వయం సమృద్ధి సాధించాలంటే ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. బకాయి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కౌన్సిల్ లో మహిళా సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, మహిళా సాధికారతకు ఇది ఒక నిదర్శనమని పేర్కొన్నారు.

**రూ.55.73 కోట్ల బడ్జెట్ వివరాలు:**

కౌన్సిల్ ఇన్చార్జి మున్సిపల్ కమీషనర్ వై. కొండల రావు 2026-27 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాల అంచనాలను సభ ముందు ఉంచారు.
ప్రారంభ నిల్వ: రూ. 24.87 కోట్లు
అంచనా ఆదాయం: రూ. 56.03 కోట్లు
మొత్తం నిల్వ: రూ. 80.90 కోట్లు
ప్రతిపాదిత వ్యయం: రూ. 55.73 కోట్లు
ముగింపు నిల్వ: రూ. 25.17 కోట్లు

## కోతులు, కుక్కల బెడదకు చెక్

పట్టణ ప్రజలను ఎంతో కాలంగా వేధిస్తున్న కుక్కలు, కోతుల సమస్యపై కౌన్సిల్ సభ్యులు చర్చించగా, కలెక్టర్ స్పందిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి తగిన నిధులు కేటాయించి, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు కౌన్సిల్ ఏజెండాలోని 11 అంశాలను సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు, వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు**



**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో భువనగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ కమిటీ నుండి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తున్నా కనీసం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. జిల్లా కేంద్రంలో 5000 మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలో చదువుతున్న పరిస్థితి ఉందని, భువనగిరిలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఏయిడెడ్ కళాశాలను ప్రభుత్వమే తన ఆధీనంలో తీసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ జగన్ నాయక్, పుట్టల ఉదయ్ పాల్గొన్నారు.

## మంచినీటి బోరులను కాపాడండి

**ముద్ర, తుంగతుర్తి:**

తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి గత కొన్ని దశాబ్దాల నుండి తాగునీటిని అందిస్తున్న మంచినీటి బోరులను రోడ్డు విస్తరణ పేరుతో తొలగించవద్దని సర్పంచ్, పాలకవర్గం జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగతుర్తి నుండి వెంపటి, మానపురం గ్రామాల మధ్య రోడ్డు వెడల్పులో భాగంగా మంచినీటికి ప్రధాన జీవనాధారమైన బోరులు రోడ్డు పక్కనే ఉండడంతో సదరు కాంట్రాక్టర్ తీసివేయాలని సూచించడం తో వాటిని తొలగించవద్దని గ్రీవెన్స్ డేలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, ఉపసర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయాల భూమిపూజ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మున్సిపల్ పట్టణంలోని రైతు బజార్ లో పునర్నిర్మాణం చేపట్టనున్న రేణుక ఎల్లమ్మ, బంగారు మైసమ్మ దేవాలయాలకు సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖా బాబురావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల ఏర్పాటుతో పాటు, పూర్వీకుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నదని అన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాడూరి నరసింహ, రంగ క్రిష్టయ్య, చిన్నం శ్రీను, రైతు బజార్ సంఘం అధ్యక్షులు యట్టా నాగరాజు,ఎస్టేట్ అఫీసర్ సాయిలు పాల్గొన్నారు.



## మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట:**

మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణ కేంద్రంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్ నందు మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, చైర్ పర్సన్ నివేదిత, వైస్ చైర్ పర్సన్ షఫీ ఉల్లాలతో కలిసి సూర్యాపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. మొదటిసారిగా నిర్వహించే బడ్జెట్ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని అన్నారు.

# మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- కాంగ్రెస్ కౌన్సిలర్లు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

కౌన్సిల్ సమావేశాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బర్రె పూజిత, జాలిగం విగ్నేష్, బొంతల నరసింహ, పాశం అమర్నాథ్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సి పల్ కౌన్సిల్ సమావేశం ప్రతినెల నిర్వహించుకోవలసి ఉండగా మున్సిపల్ అధికారులు మున్సిపల్ చైర్మన్ ను, పాలకవర్గాన్ని తప్పుదోవ పట్టించి జాప్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మెప్మాలో మహిళా సంఘాల నిధులు గోల్మాల్ విషయంలో అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణ మహిళలందరికీ భరోసా కల్పించాలని దారిమళ్లిన నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

## రెండు వేల ఇండ్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

భువనగిరి పట్టణంలో దాదా పు 2000 ఇంటి నెంబర్లు 22ఏ నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు ఎజెండా తీసు కొచ్చి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కోరారు. పట్టణంలో 50 సంవత్సరాలుగా ఇందిరమ్మ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ఇండ్లను నిర్మించి ఇవ్వగా, కొంత మంది అధికారుల అత్యుత్సాహం వల్ల పేదలు వారి పిల్లల పెండ్లిలకు, చదువులకు, అవసరాలకు బ్యాంకుల నుండి ఇతర మార్గాల ద్వారా రుణాలు పొందలేని పరిస్థితు ల్లో ఉన్నారని అన్నారు. వెంటనే 22ఏ నిషేధిత జాబితా నుండి పేదల ఇండ్లను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ తో పాటు కమీష నర్ లను వారు కోరారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
31.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..**

తిరుమల యాత్రలో కాణిపాకం, అరుణాచలం, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాలను తమకు అనుకూలంగా ఏ క్రమంలోనైనా దర్శించుకోవచ్చు.






## ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం ఏర్పాటు

- గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చేసిన కృషి ఫలించింది. ఆయన అభ్యర్థన మేరకు బీడీఎల్ సంస్థ తన సీఎస్ఆర్ నిధులతో ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని సమకూర్చింది. ఈ వాహనాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల లోక్ భవన్ వద్ద ఎంపీ రఘునందన్ రావుతో కలిసి ప్రారంభించారు. మెదక్ ప్రజలకు క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించేందుకు అవసరమైన అన్ని స్క్రీనింగ్ సదుపాయాలతో ఈ వాహనం అందుబాటులోకి వచ్చింది. ఆసుపత్రుల్లో ఉండే సమగ్ర పరీక్షా సౌకర్యాలు ఈ మొబైల్ వాహనంలోనే అందుబాటులో ఉండటం విశేషం. ఈ సేవలను మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఎంపీ రఘునందన్ రావు సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక క్యాన్సర్ ఆసుపత్రి ఉండాలన్న ప్రధాని మోదీ ఆశయ సాధనలో ఈ వాహనం ఒక ముందడుగు అని ఎంపీ తెలిపారు.. కార్యక్రమంలో బీడీఎల్ అధికారులు పాల్గొన్నారు.

## మెడిసినల్ కెమిస్ట్రీ పుస్తకం ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

మారుతున్న విద్యా విషయ ప్రణాళికలకు అనుగుణంగా పాఠ్యగ్రంథాలను రచించి ప్రచురించడం ద్వారా విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శకులుగా నిలవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత సూచించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ ఎం. శ్రీధర్, డాక్టర్ కె. భాస్కర్, డాక్టర్ జి. శ్రీనివాస్ సంయుక్తంగా రచించిన “మెడిసినల్ కెమిస్ట్రీ” పాఠ్యపుస్తకాన్ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి అకాడమిక్ ప్రయత్నాలు విద్యా ప్రమాణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పుస్తకాన్ని రూపొందించిన రచయితలను అభినందించారు. రచయితలు మాట్లాడుతూ ఈ పుస్తకం ప్రత్యేకంగా డిగ్రీ విద్యార్థుల కోసం రూపొందించబడిందని, విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలను దృష్టిలో ఉంచుకుని విషయాలను సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి అంశాన్ని సరళంగా, స్పష్టంగా ఉదాహరణలతో వివరించామని చెప్పారు. అదేవిధంగా, ఈ పుస్తకం ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలో ఔషధ రసాయన శాస్త్రాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఈ పుస్తకాన్ని దివ్య లక్ష్మీ పబ్లిషర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ ముద్రించగా, అంతర్జాతీయ ప్రమాణాల సూచీ సంకేతంతో ప్రచురించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం, రసాయన శాస్త్ర అధ్యాపకులు ఆంజనేయులు, బాలకిషన్, మనోహర్, రవి, మహేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల వంటావార్పు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జిల్లా జోగిపేట డివిజన్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ సంస్థల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీవీఏఈ జేఏసీ (తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో సమ్మె సైరన్ మోగింది. జోగిపేట డివిజన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మీటర్ రీడింగ్, పోల్ టు పోల్, ఎఫ్ఓసీ వర్కర్లను కూడా విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని కోరారు. జోగిపేట డివిజన్ విద్యుత్ కార్మికుల తరఫున ఎస్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ వెంకట్ నాయక్, 327 యూనియన్ నాయకులు లక్ష్మయ్య, మొగులయ్య, బాలరాజ్, కృష్ణదేవరాయలు, మల్లేశం, అలాగే హెచ్ 82 ట్రాన్స్‌కో భాను ప్రకాష్ ఈ డిమాండ్లు వ్యక్తం చేశారు. కార్మికులకు మద్దతుగా పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. 24 గంటలు కుటుంబాలకు దూరంగా సుదూర ప్రాంతాల్లో పనిచేస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సేవలందిస్తున్న కార్మికులకు న్యాయమైన హక్కులు కల్పించడంలో ప్రభుత్వం వెనుకడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీజేఏసీ నాయకులు రంజిత్, జోగినాథ్, రాజేందర్, సాయిలు, పవన్, నాగరాజు, మల్లేశం, సుధాకర్, హరికృష్ణ, సురేష్, మక్తర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

కరోనా సమయంలో సేవలు అందించిన స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలని, 2024లో తొలగించిన నర్సులను ఎన్‌హెచ్ఎం ఖాళీ పోస్టులతో భర్తీ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక నియామకాల ద్వారా 2022లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించిన స్టాఫ్ నర్సులను 2024లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. వారిని తిరిగి నియమించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. గతంలో కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ఎన్‌హెచ్ఎం పోస్టుల్లో తొలగించిన వారిని తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. సంబంధిత అధికారులు మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ ధర్నాలో స్టాఫ్ నర్సులు సంపత్, తార ,గీత, బాల్ లక్ష్మి, లక్ష్మి రజిత తదితరులు పాల్గొన్నారు.




## రూ.104 కోట్లతో మున్సిపల్ బడ్జెట్

- సమస్యలు లేవనెత్తిన సభ్యులు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపాలిటీకి 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌గా రూ. 104 కోట్ల 94 లక్షల 74 వేలును ఆమోదించారు. చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ అధ్యక్షతన బడ్జెట్, సాధారణ మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఖర్చులను రూ. 100 కోట్ల 4 లక్షల 73 వేలుగా నిర్ణయించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు రూ. 88.24 కోట్ల మేర అదనంగా నిధులు సమకూరుతాయని అంచనా వేశారు. వివిధ గ్రాంటుల ద్వారా యూఐడీఎఫ్ కింద రూ. 18.70 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ కింద రూ. 37.50 కోట్లు, ఎల్డీఎఫ్ కింద రూ. 29.10 కోట్లు, ఎస్ఎఫ్‌సీ కింద రూ. 2.16 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 1 కోటి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గ్రాంట్ల ద్వారా రూ. 84 లక్షలు, ఎస్ఆర్ఎఫ్ ద్వారా రూ. 20 లక్షలు సమకూరే అవకాశముందని బడ్జెట్‌లో పొందుపరిచారు. బడ్జెట్‌లో పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్ల దుస్థితి, డ్రైనేజ్ వ్యవస్థలో లోపాలు, తాగునీటి సమస్యలు, వీధి



దీపాల ఏర్పాటు వంటి అంశాలను కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, మామిళ్ల ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, శృతి, సోహేయల్, లక్ష్మీ స్వరాగిణి, కొటాల లలిత, శంసున్నిసా బేగం తదితరులు ప్రస్తావించారు. చైర్‌పర్సన్ రాధిక స్పందిస్తూ, కౌన్సిలర్లు సూచించిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమని ఆమె విజ్ఞప్తి చేశారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల కోసం గడువును పొడిగించాలి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జోగిపేట పట్టణ సీనియర్ నాయకుడు, 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ అందోల్ తహసీల్దార్‌కు ఇండ్ల స్థలాల దరఖాస్తుల గడువును పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 20 నుంచి 31 వరకు ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని అందోల్ తహసీల్దార్ ప్రకటించిన నేపథ్యంలో, అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకునేందుకు సమయం తక్కువగా ఉందన్నారు. అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో నివసించే ప్రజలు ఉగాది, శ్రీరామనవమి, జోగినాథ స్వామి జాతరలలో నిమగ్నమై ఉన్నందున దరఖాస్తుల ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.. 10 రోజుల గడువు సరిపోదని, అవసరమైన ధ్రువపత్రాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గడువును కనీసం మరో 20 రోజులు పొడిగించాలని కోరారు. నిరుపేదలకు అనుకూలంగా గడువును పెంచి ఇండ్ల స్థలాల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## భూగర్భ జలాలపై అవగాహన సదస్సు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురం మండల పరిధిలోని వెలిమెలలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ జలాల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ డి. వైద్యనాథ్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ఏవిజికే ప్రసాద్ మాట్లాడుతూ, “నీరు జీవనాధారం” అని పేర్కొంటూ “సేవ్ వాటర్-సేవ్ లైఫ్” నినాదాన్ని అందరితో పునరావృతం చేయించారు. సభాధ్యక్షులు జిల్లా భూగర్భ జల శాఖ అధికారి డా. జి. మోహన్ మాట్లాడుతూ, యునెస్కో సంస్థ 1993లో మార్చి 22ను ప్రపంచ నీటి దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా భూగర్భ జలాలపై ఆధారపడిన నేపథ్యంలో వాటి సంరక్షణకు రైతులు వర్షపు నీటిని నిల్వ చేసేందుకు కుంటల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అదనపు వినియోగం, వృథాను నియంత్రించేందుకు ఆరుతడి పంటలను ఎంచుకోవడంతో పాటు బిందు సేద్యం పద్ధతులను అనుసరించాలని తెలిపారు. రైతులు భూగర్భ జల శాఖను సంప్రదిస్తే శాస్త్రీయ సర్వే ఆధారంగా బోర్‌వెల్ పాయింట్లు సూచిస్తామని తెలిపారు. అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులు, ముఖ్యంగా మహిళలకు భూగర్భ జల సంరక్షణ, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు, పరిశ్రమల యజమానులతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా జిల్లాలో భూగర్భ జలాలను సమర్థంగా వినియోగిస్తూ, సంరక్షణకు కృషి చేస్తున్న మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ (ఫార్మ్ డివిజన్, జహీరాబాద్), హాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ లిమిటెడ్ (గోవింద్‌పూర్ గ్రామం) సంస్థలకు భూగర్భ జల శాఖ తరపున అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ భూగర్భ జల శాస్త్రవేత్తలు డా. సంతోష్ కుమార్, రవి కుమార్, బాలకృష్ణ, ఎల్లన్న, వ్యవసాయ శాఖ అధికారులు శివకుమార్, రాణి, స్పందన, రోజా, ప్రణవి, సాయి మహేష్, కే. వెంకటరెడ్డి (స్పెషల్ ఆఫీసర్, పీఏసీఎస్ వెలిమెల), కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, అగ్రికల్చర్ మార్కెటింగ్ డొమైన్ ఎక్స్‌పర్ట్స్ ఖాజా పాషా, అలీ హుస్సేన్ తదితరులు, గ్రామ ప్రజలు, రైతులు, పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ప్రజావాణిలో అందిన వినతులను సమయానికి పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, పరిష్కార స్థితిని దరఖాస్తుదారునికి తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి**

మెదక్ జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏప్రిల్ 4న మెదక్ ప్రైవేట్ ఐటీఐ (విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా)లో ఉదయం 11 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో హైదరాబాద్‌లో పనిచేయుటకు అర్హతలు ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు బిఫార్మసీ, డిఫార్మసీ, ఎంఫార్మసీ అర్హతతో రూ. 19,726 జీతంతో 25 ఫార్మసిస్ట్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ₹16,947 జీతంతో 20 ట్రైనీ ఫార్మసిస్ట్ ఉద్యోగాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల మెదక్ జిల్లా నిరుద్యోగ అభ్యర్థులు అవసరమైన పత్రాలతో, అనుభవం ఉన్నవారు మరియు ఫ్రెషర్స్ పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247656356 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దు

- కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇచ్చి సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం, బీసీ అభివృద్ధి శాఖలు, నీటి పారుదల, రవాణా, పశుసంవర్ధక శాఖ, మున్సిపాలిటీలు, ఉపాధి తదితర శాఖలకు సంబంధించిన 50 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

- ఆశా వర్కర్లకు రూ. 18 వేల స్థిర వేతనం ఇవ్వకపోతే ఆందోళన తీవ్రం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి హెచ్చరిక

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన “చలో హైదరాబాద్” కార్యక్రమాల సందర్భంగా ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ. 18 వేల స్థిర వేతనం ఇవ్వాలని ప్రభుత్వమే ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ పోరాడుతున్న వారిపై అక్రమ అరెస్టులు చేయడం తగదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం కార్మిక వర్గానికి హక్కు అని, ఆ హక్కులను హరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి నిరంకుశ పాలనతో ఏ ప్రభుత్వం నిలబడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఆశా వర్కర్లు అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పరిపాలన స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భూలక్ష్మి, నాయకులు నీరజ, పద్మ, భాగ్యలక్ష్మి, రేణుక, కవిత, బద్రి కవిత, శ్రీలత, వరలక్ష్మి, లావణ్య, అరుణ, శ్రీ జ్యోతి, శోభ, జమున తదితరులు పాల్గొన్నారు.






## రక్తదాన శిబిరం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి పట్టణంలోని 12వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పోతిరెడ్డిపల్లి ప్రాంతంలో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పీఆర్ఆర్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం బృందావనం కాలనీలోని ధ్రువ ఆసుపత్రి వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా నిరంతరం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని పీఆర్ఆర్ యువసేన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ దశరథ్ రెడ్డి పాల్గొని పొన్న రాజేందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం, కిష్టారెడ్డి, రాజమలరెడ్డి, మోహన్, అశోక్, దామోదర్, అజ్గర్, గిరి, ఇంతియాజ్, దేవేందర్, మహేష్, సందీప్, శ్రీనివాస్, సతీష్, ప్రకాష్, సంతోష్ రెడ్డి, అశోక్, మధు, నరేష్, దస్తగిరి, నిఖిల్, వరుణ్, శేఖర్, కిరణ్, నరసింహారెడ్డి, కొమురయ్య తదితరులు, పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
31.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..**



పుణ్యక్షేత్ర దర్శనం చేసిన తర్వాత నేరుగా ఇంటికి వెళ్లాలని, ఇతరుల ఇళ్లకు వెళ్లకూడదని శాస్త్రాలు చెప్పలేదు. ఇది కూడా ఒక ఆచారంగా మాత్రమే ఉంది.




## సర్కారు ఆస్పత్రుల్లో విదేశీ వైద్యం

- **పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం**
- **ప్రభుత్వాస్పత్రుల్లో కొత్త తరహా విధానం**
- **విదేశీ వైద్యులతో సమన్వయం కోసం వెబ్ సైట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ప్రభుత్వం పేద రోగులకు తీపి కబురు చెప్పింది. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందనుంది. వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ.. విదేశాల్లో స్థిరపడిన ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలోని పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులలో త్వరలో విదేశీ వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రవాస భారతీయులైన నిపుణుల నైపుణ్యాన్ని ఇక్కడి పేద రోగులకు ఉచితంగా అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తూ.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు క ప్రత్యేక వెబ్‌సైట్‌ను వైద్య ఆరోగ్య శాఖ రూపొందిస్తోంది. దీని ద్వారా విదేశాల నుంచి వచ్చే నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుంది.

**సమన్వయంతోనే వైద్యం..**

చాలామంది విదేశీ డాక్టర్లకు తమ మాతృభూమికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, సరైన వేదిక లేక వెనుకంజ వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కేంద్రీకృత వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఈ పోర్టల్ ద్వారా వైద్యులు తమ స్పెషలైజేషన్, వారు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే రోజులు, కేటాయించగలిగే సమయాన్ని నమోదు చేసుకోవచ్చు. హైదరాబాద్ వచ్చే నిపుణులు, తమ విరామ సమయంలో కొన్ని రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదా వైద్య విద్యార్థులకు 'గెస్ట్ ఫ్యాకల్టీ'గా బోధించడం వంటి సేవలు అందించవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలకు కేంద్రంగా మారింది. ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ నిపుణులు సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ రంగంలో వైద్య ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం రూపాయి ఖర్చు లేకుండా అందుతుంది.

ఇక హైదరాబాద్ నగరంలో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఎల్బీనగర్‌కు మెడికల్ కాలేజీ కేటాయిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ్మా కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు మహేశ్వరం పేరుతో మెడికల్ కాలేజీగా ఉండగా.. ఇక నుంచి ఎల్బీనగర్‌కు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

## సహజీవనం వైవాహిక దాంపత్యమే

- **కేంద్రం సంచలన నిర్ణయం**
- **2027 జనగణన నేపథ్యంలో స్పష్టత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తమ బంధం స్థిరమైందని భావించే సహజీవన జంటలను కూడా వివాహిత జంటగానే లెక్కించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఇద్దరి సమ్మతంతో కలిసి ఉండే వారి విషయంలో ఇతరుల జోక్యం అవసరం లేకుండా వారిని వివాహిత జంటలుగా గుర్తిస్తామని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న 2027 జనగణన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహజీవనం చేస్తున్న వారి విషయంలో స్పష్టత ఇచ్చింది. సెన్సస్ వెబ్‌సైట్‌లోని ఎఫ్ఏక్యూ విభాగంలో కేంద్రం ఈ అంశాన్ని పొందుపరిచింది. ఈ మేరకు జనగణన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. కాగా 2027 జనగణనను అధికారులు మొత్తం రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఈ దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా), గృహ గణన నిర్వహిస్తారు. దీని ద్వారా గృహాల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇంధనం, ఇంటర్నెట్ వంటి వసతులతో పాటు టీవీ, కంప్యూటర్, వాహనాలు వంటి ఆస్తుల వివరాలను సేకరిస్తారు. ఈ దశలో జనాభా గణన జరుగుతుంది. వ్యక్తుల పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలసలు, ఉపాధి వంటి పూర్తి వ్యక్తిగత వివరాలను సేకరిస్తారు. (హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచు కురిసే ప్రాంతాల్లో ఇది సెప్టెంబర్ 2026లోనే జరుగుతుంది). ఈసారి జనగణనలో పౌరులకు ఒక ప్రత్యేక అవకాశం కల్పించారు. సాధారణంగా ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చి వివరాలు సేకరించే విధానంతో పాటు, పౌరులు తమ వివరాలను స్వయంగా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సౌకర్యం అందుబాటులోకి రానుంది. వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత, ఎన్యుమరేటర్ కేవలం ధృవీకరణ కోసం మాత్రమే ఇంటికి వస్తారు.

## ఆటోగ్యాస్ కు కొరత రానివ్వం

- **సమస్యను అధిగమించేందుకు ప్రజా రవాణా సేవల విస్తరణ యోచన**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ ఆధారిత వాహనాలకు గ్యాస్ కొరతకు ప్రత్యామ్నాయంగా ప్రజా రవాణా సేవలను మరింతగా విస్తరించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఎల్‌పీజీ గ్యాస్ కొరతతో ఆటోలతో సహా గ్యాస్ ఆధారిత వాహనాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సోమవారం మంత్రి పౌర సరఫరాల శాఖా అధికారులు, ఎల్ పీజీ గ్యాస్ ప్రధాన పంపిణీదారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎల్, హెచ్ సీపీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకు రావాలన్నారు. వాహనాలకు సరఫరా చేసే ఎల్‌పీసీ గ్యాస్ సరఫరాలో ఏర్పడ్డ సంక్షోభాన్ని నివారించేందుకు సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దిప్ సింగ్ పూరీ కి లేఖ రాయలని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ను ఆదేశించారు. ఎల్ పీజీ దిగుమతి చేసే నౌకలు రెండు నుంచి మూడు రోజులు ఆలస్యంగా వస్తుండడంతో ఈ సంక్షోభానికి ప్రధాన కారణమన్నారు. ,హైదరాబాద్ కలెక్టర్ హారిచందన లతో పాటు గ్యాస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ

- **ఈగల్, హైడ్రా తరహాలోనే పకడ్బందీగా అమలు**
- **ఇతర రాష్ట్రాల్లో అమలవుతోన్న చట్టాలపై అధ్యయనం**
- **సీఎం రేవంత్ రెడ్డి**
- **శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**





ఆహార కల్తీని నియంత్రించడానికి రాష్ట్రంలో ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చిన ఈగల్, హైడ్రా తరహాలోనే ఆహార కల్తీని నియంత్రించడానికి కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం దేశంలో ప్రస్తుతం అమలవుతున్న కల్తీ నిరోధక చట్టాలను అధ్యయనం చేసి పటిష్ఠ చర్యలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ప్రతినిధులకు శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో సీఎంతో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి మీడియాతో ముచ్చటించారు. రేషన్ షాపుల ద్వారా దొడ్డుబియ్యం అందించినా తినేవారు లేకపోవడంతో ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాలుగా ఆలోచనలు చేసిన తర్వాత పేదలు తినగలిగే సన్నబియ్యం అందించాలని ఈ పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం వివరించారు.. ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

**గృహ నిర్బంధంలో కేసీఆర్..**

మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫాం హౌస్ లో విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ అనుకుంటున్నారనీ కానీ తన అనుమానం ప్రకారం ఆయన కుటుంబీకులే గృహ నిర్బంధం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు జనానికి తెలిసేవి కావని చెప్పారు. రాష్ట్రంలో డీలిమిటేషన్ పై బీజేపీ నేత లక్ష్మణ్ అవగాహన లేని వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఎన్ని సీట్లు పెరిగితే అన్ని మహిళా రిజర్వేషన్లు వస్తాయని తెలిపారు. సీట్ల పెంపులో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎంతోకొంత దక్షిణాదిని గుర్తిస్తున్నారని, సీట్ల పెంపులో వ్యత్యాసం వస్తే బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు రాజకీయంగా అవకాశాలు ఉండవన్నారు.

### సన్నబియ్యం పంపిణీకి ఏటా రూ.14,560 కోట్లు ఖర్చు



పేదలు గౌరవంగా, కడుపునిండా భోజనం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సన్నబియ్యం పంపిణీకి ఎంత ఖర్చయినా భరించడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం ఏటా రూ.14,560 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీసుకొచ్చిన ఫుడ్ సెక్యూరిటీ బిల్లు ఆశయాలకు తెలంగాణలో పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్‌చాట్ చేశారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే అద్భుతమైన ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి దేననీ ఆ ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలోని సుమారు 3.39 కోట్ల మంది సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి ఉత్తమ్ వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ.40 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు చేరుతున్నాయని తెలిపారు.

## ఒకేసారి 3 నెలల రేషన్

- **ఏప్రిల్ మొత్తం బియ్యం పంపిణీ**
- **చర్యలు చేపట్టిన అధికారులు**
- **సాఫ్ట్ వేర్ అప్ డేట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రేషన్ పంపిణీకి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 3 నెలల బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. అయితే అందుకు ప్రధాన కారణం.. గత సీజన్లకు సంబంధించిన రేషన్ బియ్యం నిల్వలు పెరిగిపోవడంతో ఆ స్టాక్‌ను ఖాళీ చేసేందుకు.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక త్వరలో ఈ సీజన్ బియ్యం కూడా రానుండటంతో.. ఆలోగా ఉన్న నిల్వలను రేషన్ కార్డు దారులకు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే వచ్చే 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని.. ఏప్రిల్ నెలలోనే సరఫరా చేయనుంది. అయితే ఏప్రిల్ నెల మొత్తం రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఒకేసారి 3 నెలల బియ్యం సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్త రేషన్ దుకాణాలు కూడా అందుబాటులోకి రానున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**విరివిగా నిల్వలు..**

గత సీజన్లలో సేకరించిన ధాన్యం నిల్వలు పెరిగిపోవడం.. మరోవైపు మిల్లింగ్ పూర్తి అయి వచ్చిన బియ్యంతో గోదాముల్లో భారీగా నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పటికే గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. రేషన్ బియ్యం సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని.. అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


**వేలిముద్ర ఎలా..?**

ఒకేసారి వేలిముద్ర వేస్తే లబ్ధిదారులకు 3 నెలల కోటాను అందించాలా లేక 3 నెలల రేషన్ కోసం 3 సార్లు వేయాలా అనే దానిపై అధికారులు చర్చిస్తున్నారు. ఒక్కొక్కరూ 3 సార్లు వేలి ముద్రలు వేయాలంటే.. రేషన్ దుకాణాల వద్ద బియ్యం సరఫరా ఆలస్యమై భారీగా క్యూ లైన్లు పెరిగిపోతాయనే ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి.. ఒకసారి వేలి ముద్ర వేసినా.. 3 నెలల బియ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి.. ఏప్రిల్ 1వ తేదీ నాటికి.. బియ్యం పంపిణీ చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నిర్ణయంతో రేషన్ డీలర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. ఒకేసారి 3 నెలలకు సరిపడా స్టాక్‌ను అందుబాటులో ఉంచుకునేందుకు రేషన్ దుకాణాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకేసారి వందల క్వింటాళ్ల బియ్యాన్ని తమ వద్ద ఉంచుకునేంత పరిస్థితి లేకపోవడంతో.. డిమాండ్‌కు తగ్గట్లు రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా చేయలని పౌరసరఫరాల శాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు.. ఏప్రిల్ నెల నుంచే.. రాష్ట్రంలో కొత్త రేషన్ దుకాణాలను ప్రారంభించనున్నట్లు తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కొత్త రేషన్ షాపులను ఓపెన్ చేయడం వల్ల ప్రజలకు రేషన్ సరుకులను సరఫరా చేయడంలో మరింత వేగం పెరుగుతుందని తెలిపారు.

## కేటీఆర్ మంత్రాంగం జీవన్ కోసమేనా..?

- **ఏప్రిల్ 10న బీఆర్ఎస్ లోకి జీవన్ రెడ్డి..!**
- **జగిత్యాల జిల్లా నాయకులతో కేటీఆర్ భేటీ..**
- **బీఆర్ఎస్ నాయకుల మధ్య సమన్వయం సాధ్యమయ్యేనా...?**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**





మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం దాదాపుగా ఖాయమైంది. ఏప్రిల్ 10న జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ లో భారీ బహిరంగ సభ ద్వారా బీఆర్ఎస్ లో చేరనున్నట్లు సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఇది ఇలా ఉంటే ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాల జిల్లాలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేష్ తదితరులతో సమావేశమై పాత, కొత్త కలుపుకొని పోవాలని, అండగా ఉంటానని కేటీఆర్ సూచించినట్లు తెలిసింది. దీంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

**బీఆర్ఎస్ డైరెక్షనే కారణమా..?**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి తనను పట్టించుకోవడంలేదనే కారణం చూపి తనకున్న 40ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి రాజీనామా చేశారు. అయితే బీఆర్ఎస్ లో చేరేందుకు కమిట్ మెంట్ తీసుకున్న తర్వాత, గులాబీ డైరెక్షన్ లోనే సీఎం పై స్వరం పెంచినట్లు ప్రచారం జరుగుతుంది. సీఎం రేవంత్ ను గద్దె దించే వరకు ఊరుకునేది లేదంటూ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. అయినా కాంగ్రెస్ పెద్దలు జీవన్ వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోలేదు. ఒకరిద్దరు మాత్రం జీవన్ కు కాంగ్రెస్ ఏం తక్కువ చేసిందని, అన్ని పదవులు అనుభవించి ఇప్పుడు ఆరోపణ లు చేయడం ఏంటి అంటూ ప్రశ్నిస్తున్నారు.

**కారు ఎక్కనున్న జీవన్ రెడ్డి..?**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఏప్రిల్ 10న కారు పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ మేరకు ఇటీవలే బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి కలిసి మాట్లాడారు. జగిత్యాల శివారులో గాని, జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ లో గాని బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలిసింది. త్వరలోనే కేటీఆర్, హరీష్ రావులు జీవన్ రెడ్డిని కలవడంతో పాటు సభా స్థలాన్ని పరిశీలించ నున్నట్లు ప్రచారం జరుగుతుంది.

**ప్రత్యర్థులతో పని చేయనున్న మాజీ మంత్రి..**

రాజకీయాల్లో అసాధ్యం, సుసాధ్యమనేటివి ఉండవని రాజకీయ విశ్లేషకులు చెప్పే మాట. ఇప్పుడు ఇదే నిజం కానుందా? అంటే అవుననే చెప్పొచ్చు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరనున్నారు. అయితే గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్సీ రమణలతో ప్రత్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేయగా, ప్రస్తుతం వారితోనే కలిసి పని చేయాల్సిన పరిస్థితులు జీవన్ రెడ్డి కి ఎదురావుతున్నాయని విశ్లేషకుల అంచనా.

### సమన్వయం కురిరేనా..!

జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడం వల్ల పార్టీకి లాభం చేకూరుతుందా? లేక జీవన్ రెడ్డి వల్ల పార్టీలో తమ అవకాశాలు, ప్రాధాన్యతలు తగ్గుతాయనే అపోహలతో నాయకుల మధ్య సమన్వయం కొనసాగుతుందో వేచి చూడాల్సి ఉంది. వీరందరి మధ్య సమన్వయం సాధ్యమయ్యే పనేనా అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే జగిత్యాల ఎమ్మెల్యే రేసులో ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఉన్నారు. అయితే జీవన్ రెడ్డి రాకతో వీరి ఆశలు గల్లంతయినట్లేననే గుసగుసలు వినిపిస్తున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
31.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..**
ఇతరుల ఇళ్లకు వెళ్లితే యాత్ర వల్ల వచ్చిన పుణ్యం వారికే వెళ్తుందని చెప్పడం పూర్తిగా అపోహ, దీనికి శాస్త్రీయ లేదా ఆధ్యాత్మిక ఆధారం లేదు.

## గద్వాల ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**




తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని, మరి గద్వాల ఎమ్మెల్యే బండ్లను ఎందుకు సస్పెండ్ చేయలేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల, ఉద్యోగాల భర్తీ కై గద్వాలలో విద్యార్థుల, నిరుద్యోగు పోరు దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు కేసుల్లో గద్వాల ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరిన కూడా స్పీకర్ పార్టీ మారలేదని తీర్పు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల అవుతున్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ రూ.9 వేల కోట్లు బకాయిలు పెండింగ్ లో పెట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రైవేట్ కళాశాలల కు బకాయిలు చెల్లించనందున ఇంజనీరింగ్, వైద్య, టెక్నికల్ ఇతర కళాశాలలు మూసివేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల కబ్జాలు అక్రమాలు పెరిగిపోయాయని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రూ.900 కోట్లు దోపిడి చేసి కేరళలో ఎన్నికల ప్రచారానికి డబ్బులు తరలించారని, అదే డబ్బులతో రాష్ట్రంలో నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. నడిగడ్డలో ప్రారంభమైన ఈ ఉద్యమం రాష్ట్రమంతా విస్తరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదొస్తామని , ఇప్పటికైనా మేల్కొని నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, రెండు లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. .ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు BRS పార్టీ పోరాటం ఆగదు అని ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ ఇన్చార్జి బాసు హన్మంతునాయుడు, మాజీ జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బి ఎస్‌కేశవ్, నాయకులు పాల్గొన్నారు.

## ఏసీబీ కి చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**




నాగర్ కర్నూలు జిల్లా తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై హరిప్రసాద్ రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. ఒక కేసు విషయంలో రూ.30 వేల లంచం డిమాండ్ చేసి, బాధితుడి నుంచి రూ.20 వేలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం ఇటీవల ఇసుక కేసులో పోలీసులు ఒక ట్రాక్టర్, జేసీబీని పట్టుకున్నారు. అనంతరం మైనింగ్ అధికారులు ఆ వాహనాలపై రూ.60 వేల జరిమానా విధించారు. బాధితుడు ఫైన్ చెల్లించినప్పటికీ వాహనాలను విడుదల చేయాలంటే రూ.30 వేల లంచం ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై బాధితుడు వాయిస్ రికార్డింగ్స్‌తో ఏసీబీ అధికారులను ఆశ్రయించగా సోమవారం తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో ట్రాప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ రెడ్డి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## క్రెడిట్స్ నిబంధన సడలింపుతో ప్రమోషన్

- **క్రెడిట్స్ నిబంధన సడలింపుతో ప్రమోషన్**
- **జేఎన్‌టీయూ బీఫార్మసీ విద్యార్థులకు ఊరట**

**ముద్ర, కూకట్‌పల్లి :**



జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టీయూ) పరిధిలోని బీఫార్మసీ విద్యార్థుల పోరాటం ఫలించింది. నాలుగో సంవత్సరం విద్యార్థులను సెకండ్ సెమిస్టర్‌కు ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 2023 ప్రొసీడింగ్స్‌ను వర్తింపజేస్తూ, క్రెడిట్స్‌తో సంబంధం లేకుండా విద్యార్థులను ప్రమోట్ చేయాలని కోరుతూ మార్చి 5న విద్యార్థులు యూనివర్సిటీలో ధర్నా నిర్వహించారు. సమస్యను పరిశీలించిన వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కమిటీ, 'హ్యూమానిటీస్ గ్రౌండ్' కింద విద్యార్థులకు వెసులుబాటు కల్పిస్తూ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఈ నిర్ణయం వల్ల వందలాది మంది విద్యార్థులు డిటైన్ కాకుండా ఉంటారని విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, రాహుల్ నాయక్ తెలిపారు. ఈ ఉత్తర్వుల కాపీలను ప్రదర్శిస్తూ వారు మాట్లాడారు. ఇది విద్యార్థుల ఐక్యతకు, స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం కృషికి దక్కిన విజయమన్నారు. సకాలంలో స్పందించి నిర్ణయం తీసుకున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాగర్ నాయక్, జయరాం, శీను, ఆనంద్, రుత్విక్, త్రివిక్రమ్, తను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపంపిణీ ద్వారా సుపీరియర్ కిరోసిన్ పంపిణీ

**ముద్ర, న్యూఢిల్లీ:**

దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత వదంతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ సమస్య తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సుపీరియర్ కిరోసిన్ పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పంపిణీ చేయనుంది. సర్వీస్ స్టేషన్లలో 2,500 లీటర్ల వరకు కిరోసిన్ నిల్వకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 60 రోజులపాటు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపింది.

## నవనీత కృష్ణుడిగా అలరించిన ఒంటిమిట్ట రామయ్య

**ముద్ర, తిరుపతి:**

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. మార్గమంతా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్‌తో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసమే ఆయుధంగా..

- **ఏఐ అయినా.. యుద్ధమైనా.. దేనినైనా ఎదుర్కొందాం**

**ముద్ర, డెస్క్ :**




ఏడాది కాలంగా ప్రపంచవ్యాప్తంగా ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా చర్చ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చుట్టూనే తిరిగేది. చాట్ జీపీటీ రాకతో టెక్నాలజీ ప్రపంచంలో ఒక పెద్ద భూకంపమే సంభవించింది. "నా ఉద్యోగం ఉంటుందా?".. "కోడింగ్ నేర్చుకోవడం వృథానేనా?".. "యంత్రాలు మనుషులను బానిసలుగా చేసుకుంటాయా?" ఇలాంటి ప్రశ్నలతో సామాన్యుడి నుంచి మేధావుల వరకు అందరూ వణికిపోయారు. ఐటీ కంపెనీల షేర్లు పతనం కావడం, పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించడంతో భవిష్యత్తు అంధకారంగా కనిపించింది. కానీ ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఇప్పుడు ప్రపంచం చూపు టెక్నాలజీ స్క్రీన్ల మీద నుంచి యుద్ధ భూమి వైపు మళ్లింది.

**ఏఐ భయాన్ని కమ్మేసిన యుద్ధ మేఘాలు**

నిన్నటి వరకు మన జీవనశైలిని ఏఐ మార్చేస్తుందని భయపడ్డాం. కానీ నేడు అసలు జీవించి ఉంటామా లేదా అన్నంతగా యుద్ధ మేఘాలు ప్రపంచాన్ని కమ్మేస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం అంచున నిలబెట్టాయి. డొనాల్డ్ ట్రంప్ హయాం నుంచి మొదలైన ఈ రాజకీయ చదరంగం ఇప్పుడు క్షిపణులు, డ్రోన్ దాడుల స్థాయికి చేరుకుంది. నిన్నటి వరకు 'ప్రాంప్ట్ ఇంజనీరింగ్' నేర్చుకోవాలనుకున్న యువత, నేడు అంతర్జాతీయ వార్తల్లో 'బాలిస్టిక్ మిస్సైల్స్' సామర్థ్యం గురించి చదువుతోంది. టెక్నాలజీ సృష్టించే నిరుద్యోగం కంటే యుద్ధం సృష్టించే మారణహోమం భయంకరమైనదని ప్రపంచం గ్రహించింది.

**ఆర్థిక వ్యవస్థపై కోలుకోలేని దెబ్బ**

యుద్ధం కేవలం సరిహద్దులకు పరిమితం కాదు. అది ప్రతి ఒక్కరి వంటగదిపై ప్రభావం చూపుతుంది. సముద్ర మార్గాల్లో రవాణా నిలిచిపోవడం వల్ల నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. పశ్చిమాసియాలో అస్థిరత నెలకొంటే చమురు ధరలు పెరిగి, పేద మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వెన్నుముక విరుగుతుంది. యుద్ధ భయంతో ఇన్వెస్టర్లు వెనక్కి తగ్గడం వల్ల స్టాక్ మార్కెట్లు కుప్పకూలి, ఏఐ కంటే వేగంగా ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉంది.

**చరిత్ర పునరావృతమవుతోంది**

మానవ చరిత్రను గమనిస్తే భయం అనేది ఎప్పుడూ ఒకేలా ఉండదు. "ఒకప్పుడు ప్లేగు, కలరా వంటి మహమ్మారులు ప్రపంచాన్ని భయపెట్టాయి. ఆ తర్వాత ప్రపంచ యుద్ధాలు ప్రాణాలను బలితీసుకున్నాయి. ఇటీవలి కాలంలో కోవిడ్-19 రూపంలో కంటికి కనిపించని శత్రువుతో పోరాడాం. ఇప్పుడు ఏఐ ఆందోళనలను యుద్ధం భర్తీ చేసింది. సవాళ్లు రూపం మార్చుకుంటున్నాయి తప్ప మనిషి ఎదుర్కొనే పోరాటం మాత్రం ఆగడం లేదు. ఒక సంక్షోభం నుండి బయటపడ్డామని ఊపిరి పీల్చుకునే లోపే మరో విపత్తు పలకరిస్తోంది.

**ఆందోళన వద్దు.. ఆత్మవిశ్వాసమే ఆయుధం**

ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులు చేయాల్సింది భయంతో కుంగిపోవడం కాదు. అతిగా ఆందోళన చెందడం వల్ల మానసిక స్థిరత్వం దెబ్బతింటుంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని భయపడినా, యుద్ధం వస్తుందని వణికిపోయినా పరిష్కారం దొరకదు. చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటంటే "ఎంతటి కటిక చీకటినైనా చీల్చుకుంటూ మనిషి ముందుకు సాగగలడు." సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే శాంతి కోసం ప్రపంచ దేశాలు ఏకం కావాల్సిన సమయం ఇది. భవిష్యత్తులో ఏఐ మళ్ళీ ప్రధాన చర్చాంశం కావచ్చు లేదా సరికొత్త విపత్తు రావచ్చు. కానీ మానవ పోరాట స్ఫూర్తి ముందు ఏదీ శాశ్వతం కాదు. భయం కంటే ఆత్మవిశ్వాసమే మనల్ని ఈ సంక్షోభం నుంచి గట్టెక్కిస్తుంది.

## పేదల జీవితాల్లో వెలుగు నింపటమే లక్ష్యం

- **21 నెలల్లో రెండోసారి ఇళ్ల పంపిణీ**
- **గత పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు**
- **టిడ్కో లబ్దిదారులు కట్టిన రూ.174 కోట్లు వాడేసుకున్నారు**
- **ఏపీ సీఎం చంద్రబాబు**

**ముద్ర, విజయవాడ:**



పేదల జీవితాల్లో వెలుగు నింపటమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాయుడుపేటలో సోమవారం లబ్దిదారులకు ఇంటి తాళాలు ఇచ్చి టిడ్కో ఇళ్లను ప్రారంభించిన అనంతరం ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో రెండో మారు పేదలకు ఇళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేయించిన యుగపురుషుడు నందమూరి తారకరామారావు అని కొనియాడారు. 2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. 2014-19లో 8.19 లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టి పేదలకు అప్పగించామని, గత ఏడాదిలో 3 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు చేయించామని, ఇప్పుడు 2.5 లక్షల ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించినట్లు ఆయన తెలిపారు. గత పాలకులు వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేశారని, వాటన్నిటినీ గాడినపెడుతున్నామని అన్నారు. పేదలు ఉండే నివాస ప్రాంతాల్లో అంగన్ వాడీ, స్కూలు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ తరహాలోనే పార్కులతో పాటు అంతర్గత రోడ్లు డిజైన్ చేయించామని తెలిపారు. గత పాలకులు పేదవాళ్ల పొట్టకొట్టారు. అన్యాయం చేశారు. ఐదేళ్లలో 6.5 లక్షల ఇళ్లు మాత్రమే కట్టారన్నారు. ఈ 21 నెలల్లోనే 5.5 లక్షల ఇళ్లను కట్టి పేదవాళ్లకు అప్పగించామని, త్వరలో మరో 4.5 లక్షల ఇళ్లను నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 4.73 లక్షల ఎన్టీఆర్ హౌసింగ్ ఇవ్వాలని భావిస్తే దానిని రద్దు చేశారని, రూ.923 కోట్ల పేదవాళ్ల డబ్బులు ఎగ్గొట్టారని మండిపడ్డారు. ప్రజావేదికతో ప్రారంభించిన విధ్వంసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రూ.9.70 లక్షల కోట్ల అప్పులు చేశారని, కేంద్రం ఇచ్చిన డబ్బులు మళ్లించారని, అవినీతి అక్రమాలు, అధికార దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. రూ.174 కోట్ల టిడ్కో లబ్దిదారులు కట్టిన డబ్బును కూడా వాడేసుకున్నారని అన్నారు. 22 వేల మంది లబ్దిదారులకు ఆ డబ్బులను వెనక్కి ఇస్తున్నామని, 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు ఉచితం అన్నారు. 350, 400 ఎస్ఎఫ్‌టీ రాయితీ అని గత పాలకులు ప్రగల్భాలు పలికారని, రూ.3,109 కోట్ల ప్రస్తుతం వ్యయం చేశామన్నారు. సెంటు పట్టా పేరుతో నివాసయోగ్యం కాని స్థలాలను ఇచ్చి ఇళ్లు కట్టించే ప్రయత్నం చేశారన్నారు. శ్మశానాల్లో, వాగుల్లో, కొండల్లో స్థలాలు ఇచ్చి ఎవరికీ ఉపయోగపడకుండా చేశారని అన్నారు. పేదవాళ్లు ఉండాల్సింది మురికివాడల్లో కాదు పరిశుభ్రమైన చోట్ల నివాసం ఉండాలన్నారు. కేంద్రం ఇచ్చిన డబ్బును కూడా ఇతర అవసరాలకు వాడేసుకున్నారని, దీంతో జరిమానా కూడా వేశారని, విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టడానికి మీనమేషాలు లెక్కించారని విమర్శించారు.

## రైతుల కష్టాన్ని దోపిడీ చేయడం అన్యాయం

- **అధికారుల నిర్లక్ష్యంపై అసహనం**
- **జిల్లా వ్యాప్తంగా రైతుల భారీ సమావేశం**
- **ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి**
- **రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు కోదండ రెడ్డి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



రైతుల సమస్యలను అధికారులు పట్టించుకోకపోతే సహించబోమని రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు కోదండ రెడ్డి స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా రైతులు భారీగా సమావేశమై తమ సమస్యలను వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ రైతు సంఘం నాయకులు గట్టిగా స్పందించారు. ఈ విషయమై కోదండ రెడ్డి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువస్తే, వారి కష్టాన్ని దోపిడీ చేయడం అన్యాయమని మండిపడ్డారు. తూకంలో ఒక కిలో మాత్రమే తరుగు తీయాలని, 'మొట్టి' పూర్తిగా రద్దు చేయాలని కోరారు. అలాగే కమిషన్‌ను నాలుగు శాతం నుంచి రెండు శాతానికి తగ్గించాలని, అంతకంటే ఎక్కువ వసూలు చేయరాదని స్పష్టం చేశారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నిలువ నీడ, తాగునీరు, భోజనశాల, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తక్ పట్టి (తూకం రసీదు) తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. రైతు రాజ్యం అని చెప్పుకుంటూనే రైతులను నిర్లక్ష్యం చేయడం సరికాదని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘ నాయకులు రంగారావు, రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోరెడ్డి నరసింహారెడ్డి, జోనల్ అధ్యక్షుడు మల్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీను ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, చిగుళ్లపల్లి రమేష్, వ్యవసాయ శాఖ మార్కెట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీలో డ్రగ్స్ కలకలం

- **నలుగురు యువకులు అరెస్ట్**
- **భారీగా మాదకద్రవ్యాల స్వాధీనం**

**ముద్ర, కూకట్‌పల్లి :**

నగరంలో మరోసారి మాదకద్రవ్యాల ముఠా గుట్టురట్టయింది. జెఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న నలుగురు యువకులను కేపీ హెచ్‌బీ పోలీసులు సోమవారం తెల్లవారుజామున రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం మార్చి 29 రాత్రి కొందరు వ్యక్తులు డ్రగ్స్ విక్రయించేందుకు వస్తున్నట్లు ఎస్ఐకి ముందస్తు సమాచారం అందింది. దీంతో పోలీసులు, క్లూస్ టీం, పంచ సాక్షులతో కలిసి రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద నిఘా పెట్టారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు, అక్కడ వేచి ఉన్న మరో ఇద్దరికి అనుమానాస్పదంగా ప్యాకెట్లు అందిస్తుండగా పోలీసులు వారిని చుట్టుముట్టారు. అరెస్టయిన వారిలో విశాఖపట్నానికి చెందిన ఐటీ ఉద్యోగి బెండి సాయి భాను ప్రకాష్ (27), విజయనగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సరిపల్లి అనూప్ కుమార్ అలియాస్ పండు (27), ఢిల్లీకి చెందిన డీజే ప్లేయర్ శోభిత్ అలెన్మణి (25), జోధ్‌పూర్ (రాజస్థాన్)కు చెందిన ఆర్కిటెక్ట్ రిపుంజయ్ జోధా (29) ఉన్నారు. నిందితుల వద్ద ఉన్న స్కూటీ డిక్కీని తనిఖీ చేయగా భారీగా మాదకద్రవ్యాలు లభ్యమయ్యాయి. వీటిని క్లూస్ టీం సమక్షంలో తూకం వేయగా: 150 గ్రాముల గంజాయి, 4 గ్రాముల ఎండీఎంఏ, క్రిస్టల్స్ 9, ఎల్ఎస్‌డీ, బ్లాట్ పేపర్లతో పాటు 5 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ తరలిస్తున్న స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**విచారణలో విస్తుపోయే నిజాలు**

డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ నిందితుడు భాను ప్రకాష్ విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడించాడు. బెంగుళూరులో తన స్నేహితుడైన అభిషేక్ ద్వారా తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి, కొరియర్ ద్వారా హైదరాబాద్ తెప్పించేవారని తెలిపాడు. ఇక్కడ గంజాయి 5 గ్రాములు రూ.500, ఎండీఎంఏ గ్రాము రూ.4,500 కి, ఒక్కో ఎల్ఎస్‌డీ పేపర్‌ను రూ.2,500 కి విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.

పోలీసులు కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఉన్న ప్రధాన నిందితుడు అభిషేక్, ఇతర వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



పుణ్యక్షేత్రాల దర్శనాల వేళ..
యాత్ర అనంతరం దైవ దర్శనంతో కలిగిన ఆనందం, శాంతిని మనసులో నిలుపుకుని ఇంటికి వచ్చి సమారాధన చేయాలని పెద్దలు సూచించారు.



# ధోనీ లేకుంటే చెన్నైకి కష్టాలు తప్పవా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలి కండరాల నొప్పితో ఎంఎస్ ధోనీ దాదాపు రెండు వారాలు మైదానానికి దూరంగా ఉండనున్నాడు. దీంతో తొలి మ్యాచ్‌లలో అతని సేవలు జట్టుకు అందుబాటులో ఉండవు. ఐపీఎల్ చరిత్రలో ధోనీ లేకుండా చెన్నై జట్టు చాలా అరుదుగా ఆడింది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో మాత్రమే అతను లేకుండా బరిలోకి దిగింది. వాటిలో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించగా, నాలుగులో ఓటములు చవిచూసింది. దీంతో ధోనీ లేకుండా చెన్నై ప్రదర్శన బలహీనంగానే ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. ధోనీ గైర్హాజరీలో గతంలో సురేష్ రైనా జట్టును నడిపించినా పెద్దగా ఫలితం రాలేదు. 2010లో ఢిల్లీపై మాత్రమే విజయం సాధించగా, పంజాబ్, బెంగళూరు జట్లపై ఓటములు ఎదురయ్యాయి. 2019లో హైదరాబాద్, ముంబైపై కూడా పరాజయాలు ఎదురవడంతో ధోనీ లేకపోవడం జట్టుపై ప్రభావం చూపినట్టు స్పష్టమైంది.



రహానేను టీజ్ చేసిన రోహిత్..
మ్యాచ్ మధ్యలో సరదా ఘటన

# ఫిట్‌నెస్ మెయింటెయిన్ చేయాలి బ్రో..

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌లో సరదా ఘటన చోటుచేసుకుంది. కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే కండరాలు పట్టేయడంతో మ్యాచ్ మధ్యలో మైదానం వీడాల్సి వచ్చింది. ఈ సమయంలో బయటకు వెళ్తుండగా ముంబై స్టార్ రోహిత్ శర్మ డ్యాన్స్ చేస్తూ టీజ్ చేయడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'ఫిట్‌నెస్ మెయింటెన్ చేయాలి బ్రో.. లేకుంటే ఇలానే కండరాలు పట్టేస్తాయి' అన్నట్లుగా సరదాగా ఆటపట్టించినట్టు కనిపించింది. దీనికి రహానే కూడా నవ్వుతూ స్పందించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోహిత్, రహానేలు దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకు కలిసి ఆడిన స్నేహితులు కావడంతో ఈ సరదా ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన రోహిత్ ఇటీవల బరువు తగ్గి మరింత ఫిట్‌గా మారిన విషయం తెలిసిందే.



# వరుణ్ మిస్టరీ హిస్టరీ అయిందా?..

## శ్రీకాంత్ సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీమ్ ఇండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఫామ్‌పై మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. వరుణ్ బౌలింగ్‌లో మిస్టరీ తగ్గిపోయిందని, బ్యాటర్లు అతడిని సులభంగా ఎదుర్కొంటున్నారని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లో ముంబయిపై వరుణ్ 4 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలి ప్రత్యర్థులకు సులభంగా అర్థమైందని శ్రీకాంత్ పేర్కొన్నాడు. ఎప్పుడూ గూగ్లీలు మాత్రమే వేయడం సరిపోదని, లెగ్ స్పిన్ వంటి వేరియేషన్స్ పెంచుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు. అలాగే పవర్ ప్లేలో వరుణ్‌కు బౌలింగ్ ఇవ్వకుండా జాగ్రత్త పడాలని జట్లకు సూచించాడు.

# పాత జట్లపై కొత్త జెర్సీలతో పోరు..

## జడేజా–సంజూ మ్యాచ్‌పై ఆసక్తి



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనున్న మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా రవీంద్ర జడేజా, సంజూ శాంసన్ జెర్సీలు మారడంతో ఈ పోరుకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. ట్రేడ్ పద్ధతిలో సంజూ శాంసన్ చెన్నై జట్టుకు చేరగా, రవీంద్ర జడేజా రాజస్థాన్ జట్టులోకి మారాడు. ఒకప్పుడు తమ జట్లకు కీలక ఆటగాళ్లుగా నిలిచిన ఈ ఇద్దరూ ఇప్పుడు పాత జట్లపై ఆడబోతుండటంతో ఎవరు మెరుగ్గా రాణిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. దీంతో గువాహటిలో జరగనున్న ఈ మ్యాచ్‌లో జడేజా, సంజూ ప్రదర్శన ఎలా ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# రోహిత్ 2.0 వచ్చేసింది..

## జట్లకు కుంబ్లే హెచ్చరిక

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆడిన దూకుడు ఇన్నింగ్స్‌పై భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ప్రశంసలు కురిపించాడు. రోహిత్ 2.0 వచ్చేసిందని, మిగతా జట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. కోల్‌కతాపై జరిగిన మ్యాచ్‌లో రోహిత్ కేవలం 38 బంతుల్లో 78 పరుగులు చేసి ముంబయి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ వంటి బౌలర్లపై అతడు ఆధిపత్యం ప్రదర్శించిన తీరు ఆకట్టుకుందని కుంబ్లే పేర్కొన్నాడు. అలాగే కోల్‌కతా బౌలింగ్ వినియోగంపై కూడా కుంబ్లే ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా నరైన్‌ను పవర్‌ప్లేలో ఉపయోగించకపోవడం జట్టుకు నష్టం కలిగించిందని, వనరులను సరిగ్గా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు.

# పృథ్వీ షా రికార్డు బద్దలవుతుందా?

## యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై అందరి చూపు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026లో మరోసారి యువ ఆటగాళ్ల ప్రతిభ చర్చనీయాంశంగా మారనుంది. ముఖ్యంగా 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై అందరి చూపు నిలిచింది. గత సీజన్‌లో కేవలం 7 ఇన్నింగ్స్‌ల్లో 252 పరుగులు చేసి సంచలనం సృష్టించిన అతడు, 35 బంతుల్లో సెంచరీ చేసి ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకం సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఈ సీజన్‌లో ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన టీనేజ్ బ్యాటర్‌గా నిలిచే అవకాశముంది. ప్రస్తుతం ఈ రికార్డు పృథ్వీ షా పేరిట ఉంది. 201819 మధ్య 25 ఇన్నింగ్స్‌ల్లో 598 పరుగులు చేసిన షా రికార్డును అధిగమించేందుకు వైభవ్‌కు కేవలం 347 పరుగులు అవసరం. ఆక్రమణాత్మక బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైభవ్‌కు ఈ సీజన్‌లోనూ ఓపెనర్ బాధ్యతలు అప్పగించారు. మార్చి 30న గువాహటిలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో రాజస్థాన్ రాయల్స్ తమ ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టిస్తాడా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# మ్యాచ్ మధ్యలో గర్ల్‌ఫ్రెండ్‌కు లవ్ ప్రపోజల్

## చేజారిన రింగ్...

### స్టేడియంలో సరదా ఘటన

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ మధ్యలో ఓ ప్రేమజంటకు సంబంధించిన సరదా ఘటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. గర్ల్‌ఫ్రెండ్‌కు ప్రపోజ్ చేయబోయిన యువకుడి చేతిలోని రింగ్ జారి పడటంతో కొద్దిసేపు హడావిడి నెలకొంది. మ్యాచ్ జరుగుతుండగా యువకుడు మోకాళ్లపై కూర్చుని ప్రపోజ్ చేయడానికి ప్రయత్నించాడు. అయితే ఉత్సాహంలో రింగ్ కింద పడిపోవడంతో ఇద్దరూ ఆందోళన చెందారు. చుట్టుపక్కల ఉన్న ప్రేక్షకులు కూడా రింగ్ కోసం వెతికారు. కొద్ది సేపటికే రింగ్ దొరకడంతో యువకుడు మళ్లీ ప్రపోజ్ చేయగా, యువతి అంగీకరించింది. దీంతో అక్కడున్న ప్రేక్షకులు చప్పట్లతో ఆ జంటను అభినందించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
31.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## పెద్ది హైప్‌కు వాయిదాల బ్రేక్?..

**అభిమానుల్లో పెరుగుతున్న అసహనం**

ముద్ర, సినిమా డెస్క్:
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాపై మొదట భారీ హైప్ కనిపించినప్పటికీ, వరుస వాయిదాల వార్తలతో ఆ ఉత్సాహం తగ్గుతున్నట్టుగా చర్చ సాగుతోంది. రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. చరణ్ కొత్త మేకోవర్ చూసి అభిమానులు ప్రశంసలు కురిపించారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో స్పష్టత లేకపోవడం అభిమానుల్లో అసంతృప్తి పెంచుతోంది. ముందుగా ప్రకటించిన తేదీ నుంచి ఇప్పటికే ఒకసారి వాయిదా పడిన ఈ చిత్రం, ఇప్పుడు మరోసారి వాయిదా పడే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. సినిమాను నాణ్యతతో తీర్చిదిద్దేందుకు సమయం తీసుకుంటున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే పదేపదే విడుదల తేదీలు మారడం వల్ల సినిమాపై ఉన్న హైప్ తగ్గే ప్రమాదం ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న చిత్రానికి సరైన ప్రణాళిక అవసరమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



## ధనుష్‌తో మళ్లీ నటించాలని ఉంది..

ముద్ర, సినిమా డెస్క్:
టాలీవుడ్‌లో వరుస విజయాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ సంయుక్త, నటుడు ధనుష్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. 'సార్' సినిమాలో వీరిద్దరి కాంబినేషన్ మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంయుక్త మాట్లాడుతూ ధనుష్ అద్భుతమైన నటుడని, ఆయన కథల ఎంపికలో ప్రత్యేకమైన దృష్టి ఉంటుందని తెలిపారు. సెట్స్‌లో ఆయన చాలా ప్రశాంతంగా ఉంటారని, కెమెరా ముందు మాత్రం పూర్తి ఎనర్జీతో నటించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని వెల్లడించారు. మళ్లీ ధనుష్‌తో కలిసి నటించే అవకాశం వస్తే తప్పకుండా చేయాలని ఉందని సంయుక్త తన ఆసక్తిని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆమె పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, మరోసారి ఈ జంట కలిసి నటిస్తే బాగుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.



## సూరి సరసన మమిత బైజు..

**మరో క్రేజీ ఆఫర్ దక్కించుకున్న ప్రేమలు హీరోయిన్**

ముద్ర, సినిమా డెస్క్:
మలయాళ నటి మమిత బైజు 'ప్రేమలు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుని దక్షిణాది చిత్రసీమలో వరుస అవకాశాలు అందుకుంటోంది. ఇటీవల తమిళ, తెలుగు నిర్మాతల దృష్టిని ఆకర్షించిన ఈమెకు మరో క్రేజీ ప్రాజెక్ట్ దక్కినట్లు సమాచారం. కమెడియన్ నుంచి హీరోగా మారిన సూరి నటిస్తున్న కొత్త యాక్షన్ డ్రామాలో మమిత బైజు హీరోయిన్‌గా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. 'సూరి 7' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రవికుమార్ దర్శకత్వం వహించనుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్న మమిత, ప్రస్తుతం తమిళ స్టార్ సూర్య సరసన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో కూడా నటిస్తోంది. వరుస అవకాశాలతో ఆమె కెరీర్ వేగంగా ముందుకు సాగుతోందనే చర్చ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.

## గ్యాంగ్‌స్టర్‌గా మెగాస్టార్..

- **బాబీ సినిమాలో నయా లుక్‌లో చిరంజీవి**

ముద్ర, సినిమా డెస్క్:
మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపొందనున్న కొత్త సినిమాపై ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం త్వరలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' విజయం సాధించడంతో, ఈ ప్రాజెక్టుపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో చిరంజీవి గ్యాంగ్‌స్టర్ పాత్రలో నయా లుక్‌లో కనిపించనున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రెండో భాగంలో మాస్ ఎలిమెంట్స్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉండనున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్‌గా ప్రియమణి పేరు వినిపిస్తుండగా, సంగీతాన్ని తమన్ అందించే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు తెలిసింది.





## బాలీవుడ్ స్టార్‌తో వంశీ పైడిపల్లి సినిమా?


ముద్ర, సినిమా డెస్క్:
వంశీ పైడిపల్లి నుంచి చివరి సినిమా వచ్చి మూడేళ్లు దాటినా అతనికి అవకాశాలు తగ్గలేదు. నిర్మాత దిల్ రాజు అండతో మహేష్ బాబు, నాగార్జున, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌లతో సినిమాలు చేసి మంచి గుర్తింపు సంపాదించాడు. విజయ్‌తో చేసిన "వారసుడు" సినిమా మిశ్రమ స్పందన వచ్చినా కమర్షియల్‌గా సక్సెస్ సాధించింది. ఇప్పుడైతే బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో కొత్త సినిమా కోసం దిల్ రాజు, వంశీ పైడిపల్లి కలిసి ప్లాన్ చేస్తున్నట్టు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నయనతార పేరు కూడా వినిపిస్తోంది. ఈ సినిమా నిజమైతే వంశీ కెరీర్‌లో కీలక మలుపుగా మారే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## కల్కి-2లో మరో విలన్?..

**కథలో కొత్త ట్విస్ట్‌పై చర్చ**



ముద్ర, సినిమా డెస్క్:
రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'కల్కి 2898 AD' రెండో భాగం షూటింగ్ ప్రారంభమైనట్లు సమాచారం. వచ్చే నెల తొలి వారం నుంచి ప్రభాస్ కూడా షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.v మొదటి భాగంలో కమల్ హాసన్ ప్రతినాయకుడిగా మెప్పించగా, రెండో భాగంలో ఆయన పాత్ర కొనసాగనుంది. అయితే కథను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు మరో ప్రతినాయకుడి పాత్రను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కొత్త పాత్ర కోసం ఓ బాలీవుడ్ స్టార్ నటుడిని తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు సమాచారం. దీంతో రెండో భాగం మరింత ఉత్కంఠభరితంగా ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



## హద్దులు దాటిన అభిమానం..

**హీరోయిన్‌కు చేదు అనుభవం**

ముద్ర, సినిమా డెస్క్:
హీరోయిన్ హనీ రోజ్‌కు షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చేదు ఘటన ఎదురైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి సెల్ఫీల కోసం ఆమెకు అత్యంత దగ్గరకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి ఆమెకు తెలియకుండా నడుముపై చేయి వేసిన ఘటన వీడియోలో కనిపించింది. అయితే ఆమె ప్రశాంతంగా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అభిమానం పేరుతో ఇలాంటి చర్యలు చేయడం తగదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మహిళా సెలబ్రిటీల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.




## హిమాలయాల ఒడిలో సాక్షి మాలిక్ గ్లామర్ షో

బాలీవుడ్ నటి, మోడల్ సాక్షి మాలిక్ ట్రెండీ ఫ్లోరల్ బికినీతో హిమాలయాల మధ్య తీసుకున్న స్టైలిష్ ఫోటో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. పచ్చని కొండలు, నీలి సరస్సు మధ్య కూర్చున్న ఆమె లుక్ అభిమానులను ఆకర్షిస్తోంది. ఫ్లోరల్ బికినీ, సన్‌గ్లాసెస్, సింపుల్ మేకప్‌తో ఆమె స్టైల్ మరింత హైలైట్ అయింది. సోషల్ మీడియాలో ఫిట్‌నెస్, ఫ్యాషన్, ట్రావెల్ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తున్న సాక్షి, ఇలాంటి గ్లామర్ ఫోటోలతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

## ఎగిరే విమానంలో ఇంటర్వెల్ ఫైట్?..

**ఎన్టీఆర్–నీల్ మూవీపై కొత్త చర్చ**

ముద్ర, సినిమా డెస్క్:
జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సినిమాపై ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఇంకా టైటిల్ ప్రకటించకపోయినా 'డ్రాగన్' పేరును పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఇంటర్వెల్ సమయంలో ఎగిరే విమానంలో హీరో-విలన్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్‌ను భారీ ఖర్చుతో గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా సినిమాలో మరికొన్ని యాక్షన్ సన్నివేశాలు కూడా భారీ స్థాయిలో ఉండనున్నట్లు సమాచారం. గత చిత్రాల కంటే భిన్నంగా ఈ మూవీని కలర్‌ఫుల్ విజువల్స్‌తో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సినిమా పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానుందనే అంచనాలు పెరుగుతున్నాయి.



## ఓటీటీలోకి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

ముద్ర, సినిమా డెస్క్ : శివాజీ, లయ, రోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన "సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని" సినిమా థియేటర్ల తర్వాత ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. మార్చిలో విడుదలై ప్రేక్షకులను నవ్వించిన ఈ చిత్రం ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ కామెడీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కథ విషయానికి వస్తే నిజాయతీగల పంచాయతీ కార్యదర్శిగా శివాజీ నటించిన పాత్ర చుట్టూ సినిమా సాగుతుంది. భార్య, కొడుకుతో ప్రశాంతంగా జీవిస్తున్న అతని జీవితంలో అనూహ్యంగా జరిగిన ఒక సంఘటన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఆ సంఘటన తర్వాత కుటుంబాన్ని కాపాడుకోవడానికి అతను చేసే ప్రయత్నాలు, అందులో వచ్చే ట్విస్టులు ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయి.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com